
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
ఆదివారం 1 డిసెంబరు 2024



ముసురు

ఉదయం నుంచి వర్షం

నేడు కూడా... -8లో



93 శాతం పింఛన్లు పంపిణీ జిల్లాలో సామాజిక పింఛన్లు ఈసారి ఒకరోజు ముందుగానే పంపిణీ చేశారు. శనివారం సాయంత్రం వరకూ 1,61,584 మందికిగాను 1,51,193 (93 శాతం) మందికి రూ. 65,10,25,500 పంపిణీ చేశారు. -8లో

కన్నుల పండువగా పద్మనాభుని దీపోత్సవం



అనంత పద్మనాభస్వామి గిరి మెట్లపై దీపాలు వెలిగిస్తున్న మహిళలు. - వార్త 8లో

విశాఖ డెయిరీపై విచారణ షురూ

- ఆరోపణలు అనేకం
- సంస్థ నిధులను సొంతానికి వాడుకుంటున్నారనే విమర్శలు
- సభా సంఘం ఏర్పాటు
- విశాఖపట్నం జిల్లా నుంచి ఇద్దరు శాసనసభ్యులకు స్థానం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ డెయిరీ ఆడారి కుటుంబం సొంత జాగీరుగా మారిపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఆదాయానికి, వ్యయానికి పొంతన లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డెయిరీ చేయి జారిపోకుండా ఉండేందుకు ఏ పార్టీ అధికారంలో ఉంటే అందులో చేరడం, డెయిరీ నిధులను మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తోందనే విమర్శలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు కూటమి ప్రభుత్వం డెయిరీ అక్రమాలను నిగ్గు తేల్చేందుకు సభా సంఘాన్ని వేసింది. అందులో జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబులకు స్థానం కల్పించింది. రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

సొసైటీగా ప్రారంభమైన విశాఖ డెయిరీని ఆడారి తులసీరావు పెద్ద సంస్థగా తీర్చిదిద్దారు. ఏడాదికి రూ.2 వేల కోట్లు టర్నోవర్ సాధించేలా చేశారు. అదే సమయంలో స్వార్థపూరిత ... మిగతా 6వ పేజీలో

కొట్లాట కేసులో ముగ్గురి అరెస్టు

భీమునిపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండలం పెద ఉప్పాడలో రెండ్రోజుల క్రితం జరిగిన ఘర్షణ కేసులో స్థానిక పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా వున్నాయి.

పెద ఉప్పాడకు చెందిన ఫిరాది రాము, కారి రాము అనే వ్యక్తులకు గతంలో ఘర్షణలు జరిగాయి. వీరు ఈనెల 28న రాత్రి మళ్లీ ఘర్షణకు దిగి కర్రలు, బీరు బాటిల్స్‌తో కొట్టుకున్నారు. ఈ ఘర్షణలో బ్రమ్మడి అజయ్ (ఎర్రయ్య), చిల్ల అప్పలరాజు (పండు)లు కలిసి కారి రామును తీవ్రంగా గాయపర్చారు. ఇరువర్గాల నుంచి అందిన ఫిర్యాదులపై రెండు కేసులు నమోదు చేసినట్టు సీఐ సుధాకర్ తెలిపారు. ఈ కేసులో ఫిరాధి రాము, అజయ్, అప్పలరాజులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు వెల్లడించారు. కేసును ఎస్ఐ ఎస్. గౌరి దర్యాప్తు చేస్తున్నారు.





6వ వార్డులో పింఛన్ల పంపిణీ


పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్

కొమ్మాది, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 6వ వార్డులోని రిక్షా కాలనీలో శనివారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యార్లగడ్డ జీవన్‌కుమార్, దాసరి శ్రీనివాస్, గరే గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక బీమా దరఖాస్తులకు సంక్రాంతిలోగా మోక్షం

రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్

సింహాచలం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వ పాలనలో అపరిష్కృతంగా ఉన్న కార్మిక బీమా దరఖాస్తులను సంక్రాంతిలోగా పరిష్కరించాలనే లక్ష్యంతో ఉన్నట్టు రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆయన సతీసమేతంగా సింహాచల వరాహలక్ష్మీనృసింహస్వామిని శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మీడియాతో మాట్లాడుతూ గత పాలకుల నిర్వాకం వలన రాష్ట్రంలో సుమారు 3600మంది కార్మికులు బీమా కోసం దరఖాస్తు చేసుకోగా, వాటిలో సుమారు 950 దరఖాస్తులకు సుమారు రూ.47 కోట్లు చెల్లించి.. మిగిలిన వారందరికి మొండి చూపారని విమర్శించారు.

విశాఖ డెయిరీపై విచారణ షురూ

... 5వ పేజీ తరువాయి

నిర్ణయాలు తీసుకున్నారు. పాడి రైతులను సభ్యులుగా చేసుకుని ఏర్పాటైన సొసైటీని కంపెనీగా మార్చేశారు. అందులో తన కుటుంబ సభ్యులను డైరెక్టర్లుగా పెట్టుకున్నారు. విశాఖ డెయిరీ పేరుతో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎక్కడికక్కడ భూములు కొన్నారు. వాటి విలువ ఇప్పుడు వందల కోట్ల రూపాయలకు చేరింది. వాటిలో అనేకం చేతులు మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతుల కోసమని నిర్మించిన 'కృషి' ఆస్పత్రిని కార్పొరేట్ సంస్థకు అప్పగించేశారు. మూడేళ్లుగా రైతులకు బోనస్ ఇవ్వడం మానేశారు. ఆ స్థానంలో సర్వసభ్య సమావేశాల్లో కానుకలు ఇస్తున్నారు. పాల ధరలు పెరుగుతుంటే...రైతులకు ఇచ్చే సేకరణ ధరను ఇటీవల తగ్గించేశారు. అదేమిటని ప్రశ్నిస్తే నష్టాలు వస్తున్నాయని సమాధానం చెబుతున్నారు. ఇంత భారీ వ్యాపారం చేస్తుంటే నష్టాలు ఎలా వస్తున్నాయనేది అందరి అనుమానం.

- హైదరాబాద్‌లో ఆడారి కుటుంబం సొంతంగా ఒక డెయిరీని పెట్టుకొని దానికి ఇక్కడి నుంచి రోజూ 15 వేల లీటర్ల పాలను సరఫరా చేస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. డెయిరీలో కీలక స్థానాల్లో ఉన్నవారు ఇలాంటి ప్రైవేటు వ్యాపారాలు చేయకూడదంటున్నారు.
- పరవాడ సమీపాన దేవదాయ శాఖ భూమిని డెయిరీ పేరుతో లీజుకు తీసుకొని కుటుంబ సభ్యులతో ఐస్క్రీమ్ పార్లర్ పెట్టించారనే మరో అభియోగం.
- డెయిరీ సభ్యులకు ఆడపిల్ల పుడితే లక్ష రూపాయలు, మగబిడ్డ పుడితే రూ.50 వేలు డిపాజిట్ చేయాలని నిర్ణయం ఉంది. దీనికి రూ.25 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. రైతుల పేరుతో వాటిని డెయిరీ పెద్దలు వాడేసుకున్నారనేది ప్రధాన ఆరోపణ.
- నర్సీపట్నం, చినగదిలి, తదితర ప్రాంతాల్లో డెయిరీ పేరుతో 34 ఎకరాల భూములు ఉన్నాయి. అవి సొసైటీ నిధులతో కొనుగోలు చేసినవి. వాటి లెక్కలు సరిచూడాల్సి ఉంది.
- నరవలో డెయిరీ పేరుతో మూడు ఎకరాల భూమి కొనుగోలు చేసి అందులో 90 సెంట్లు కుటుంబ సభ్యుల పేరు మీదకు మార్చేశారని ఆరోపణలుఉన్నాయి.
- విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం గర్భాంలో 50 ఎకరాలు డెయిరీ పేరున ఉన్నాయి. వాటి సంగతి తేల్చాల్సి ఉంది.

రెడ్ రిబ్బన్ ఆకృతిలో మెడికోలు



తగరపువలస, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి) : సంగివలస ఎన్ఆర్ఐ వైద్య కళాశాల విద్యార్థులు డిసెంబర్ 1న జరగనున్న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని రెడ్ రిబ్బన్ ఆకారంలో పరేడ్ నిర్వహించారు. ఎయిడ్స్ పట్ల ప్రజల్లో అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందని అధ్యాపకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మెడికల్ విద్యార్థులు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.





























దీప కాంతుల్లో నరసింహస్వామి

నరసింహస్వామి ఆలయంలో దీపాలంకరణ

స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

భీమునిపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీక అమావాస్యను పురస్కరించుకుని పురాతనమైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని గర్భగుడిని శనివారం సాయంత్రం దీపాలంకరణతో శోభాయమానంగా అలంకరించారు. తుఫాన్ ప్రభావంతో ఉదయం నుంచి ఒక మోస్తరుగా వర్షం కురుస్తున్నప్పటికీ అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఒకపక్క వర్షం, మరోపక్క ఈదురుగాలులతో ప్రజలు చలికి గజగజలాడుతున్నారు.

డివైడర్‌పైకి దూసుకుపోయిన కారు


నుజ్జునుజ్జయిన కారు ముందు భాగం

సాగర్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సాగర్‌నగర్ బీచ్‌రోడ్డులో మోగధారమ్మ గుడి సమీపంలో శనివారం ఉదయం ఓ కారు ఒకటి ప్రమాదానికి గురైంది. కారు విశాఖ నుంచి భీమిలి వైపు వెళుతున్న కారు అదుపు తప్పి డివైడర్‌పైకి ఎక్కడంతో వాహనం ముందు భాగం నుజ్జునుజ్జయింది. కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో అందులో ఉన్న ముగ్గురు యువకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు అండగా సామాజిక పింఛన్లు

భీమునిపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు కొండంత అండగా ఎన్టీఆర్ సామాజిక పింఛన్లు నిలుస్తాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. శనివారం మూడో వార్డులోని లబ్ధిదారులకు ఆయన పెన్షన్లు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఉమ్మడి మసేను, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత బ్యూటీషియన్ శిక్షణ తరగతులు ప్రారంభం

భీమునిపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిసెంబరు రెండో తేదీ నుంచి ఉచిత బ్యూటీషియన్ కోర్సు శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నట్టు కాలేజీ ప్రిన్సిపాల్ మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్సుపై నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఎస్ఎస్‌సీ లేదా ఆపై విద్యార్హతలు కలిగిన యువతులు మాత్రమే ఈ కోర్సు చేసేందుకు అర్హులన్నారు. అభ్యర్థిని వయస్సు 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9014758949 సెల్ నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.



కన్నుల పండువగా పద్మనాభుని దీపోత్సవం

భారీగా తరలివచ్చిన భక్తులు

పద్మనాభం (విశాఖపట్నం జిల్లా), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అనంత పద్మనాభుని దీపోత్సవ సంబరం అంబరాన్ని తాకింది. ఏటా కార్తీక బహుళ అమావాస్య రోజున నిర్వహించే ఈ ఉత్సవాన్ని శనివారం అత్యంత భక్తిప్రపత్తులతో నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు వేకువ జాము నుంచి పద్మనాభం చేరుకున్నారు. అనంతుని గిరి ప్రథమ పావంచా వద్ద పూజలు చేసి అనంతరం మెట్లకు పసుపు, కుంకుమ బొట్లు పెట్టుకుంటూ వెళ్లారు. సాయంత్రం వేళ రాలేమని భావించిన పలువురు ఉదయాన్నే మెట్లపై దీపాలను వెలిగించారు. కొండపై పద్మనాభుని ఆలయం పునర్నిర్మాణ దశలో ఉండడంతో దేవస్థానం ప్రత్యేకంగా రూపొందించిన వేదికపై ఉత్సవ విగ్రహాలను ఉదయం ఐదు గంటల నుంచే అందుబాటులో ఉంచి భక్తులకు దర్శనాన్ని కల్పించారు. సాయంత్రం నాలుగు సమయంలో కుంతీమాధవస్వామి ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవ సమేత అనంత పద్మనాభుని ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై నిలిపి తప్పెటగుళ్లు, పులివేషాలు, కోలాటం బృందాల ప్రదర్శనల నడుమ, వేదపండితుల వేద మంత్రోచ్చారణలతో ఊరేగింపుగా ప్రథమ పావంచా వద్దకు తీసుకువచ్చారు. అక్కడ గరుడ వాహనంపై స్వామి వారిని నిలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు భీమిలి


ఉత్సవ విగ్రహాల వద్ద పూజలు చేస్తున్న గంటా శ్రీనివాసరావు

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వామివారికి పూజలు చేశారు. ప్రథమ పావంచాల వద్ద జేగంట కొట్టగానే భక్తులు అప్పటికే మెట్టపై సిద్ధం చేసుకున్న దీపాలను వెలిగించారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతం దేదీప్యమానంగా మారింది. ఉత్సవం సందర్భంగా పద్మనాభం సామాజిక వేదిక వద్ద రెవెన్యూ అధికారులు ఏర్పాటుచేసిన అల్పాహారం, మజ్జిగ పంపిణీ స్టాల్‌ను భీమిలి ఆర్డీఓ సంగీత్ మాధుర్ ప్రారంభించారు. పలువురు దాతలు కొండపైన, దిగువన భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు లా అండ్ ఆర్డర్ డీసీపీ అజిత ఆధ్వర్యంలో నార్త్‌జోన్ ఏసీపీ అప్పలరాజు, సీసీఎస్ ఏసీపీ లక్ష్మణరావు, ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవరావు ఆధ్వర్యంలో సుమారు 600 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.రాంబాబు, టీడీపీ సీనియర్ నాయకులు దామోదరరావు, నగేష్‌కుమార్, ఏపీ నాగవంశం కార్పొరేషన్ మాజీ చైర్మన్ అప్పలకొండమ్మ, అప్పలనాయుడు దంపతులు, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, సర్పంచ్ పాప, బీజేపీ ఏపీ వైద్య విభాగం కన్వీనర్ రవికుమార్, జనసేన భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్, బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లను సందర్శించిన సీపీ

ఎండాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎండాడలో జాతీయ రహదారికి ఆనుకున్న ఉన్న మహిళా పోలీస్ స్టేషన్‌తో పాటు అదే ప్రాంగణంలో ఉంటున్న సైబర్ క్రైమ్ స్టేషన్‌ను సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ శనివారం సాయంత్రం సందర్శించారు. తొలుత మహిళా పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఆయన ఫిర్యాదులు చేయడానికి వచ్చిన మహిళలు, వారి పిల్లల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వసతుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వాటిని పరిష్కరిస్తున్న తీరుపై ఆరా తీశారు. కుటుంబ కలహాలతో వస్తున్న జంటలకు ఇస్తున్న కౌన్సెలింగ్ విధానాన్ని పరిశీలించడంతో పాటు అక్కడ ఉన్న పలువురు మహిళల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ స్టేషన్ పరిసరాలను నిశితంగా పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇదే ప్రాంగణంలో ఉన్న సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి సిబ్బంది విద్యార్హతల గురించి, వారు వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్లు, వాటిపై వారికి ఉన్న పరిజ్ఞానాన్ని తెలుసుకున్నారు. స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సైబర్ క్రైం ల్యాబ్‌ని, అందులో వినియోగిస్తున్న సాంకేతికతను పరిశీలించారు. సైబర్ నేరగాళ్ల వలలో ప్రజలు పడకుండా ఉండేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని సీపీ ఆదేశించారు.

CLASSIFIEDS

RESORTS

★ విజయనగరం కలెక్టరేట్‌కు 15 కి.మీ. సమీపంలో ఫ్యామ్ ల్యాండ్ & రిసార్ట్ ఓపెన్ ప్లాట్స్ కేవలం గజం రూ.5 వేలు మాత్రమే. సంప్ర॥ రూప, సెల్ : 9014997649, 9505178788
AJV_204597

HOUSE FOR SALE

★ దేశపాత్రునిపాలెం కొత్తవలస దగ్గర 130 గజాల్లో G+1 నార్త్ ఫేసింగ్‌లో గల ఇండివిడ్యువల్ ఇల్లు రెడీ టు ఆక్యుపేతో కలదు. సంప్ర॥ 9966218163
AJV_204586

FLATS FOR SALE

★ Ready to Move 1030 sft. 2 BHK, W/F Flat for Sale in Pollutions free zone developing area @ 35L only. Not negotiable only one flat available quality construction at Tagarapuvalasa. Cont.: 98667 46418
AJV_204585

» వైజాగ్, HB కాలనీ : N/F, 2 BHK (1010 + 100 Car పార్కింగ్) ఫ్లాట్, UDS 37 చ.గ.లు, 8 Yrs Old, కాబోర్డ్స్, సీలింగ్ & CC కెమెరాలు. 67 లక్షలు : 9676246999 / 9959807957
AJB_4776

★ 26 Lakhs 2 BHK 10 yrs. Old Flat for Sale at Sujatha Nagar. 980 sft. West Face with Lift & Car Parking. Cont.: 9440786458
AJV_204594

★ Pendurthi VUDA Layout 2 BHK, N/F, 1295 sft. Each Floor One Flat Ready to occupy 1st and 5th Flr. 45L. Negotiable. Owner. Cont.: 7207459199
AJV_204595

LAND FOR SALE

★ రణస్థలం to నెల్లిమర్ల మెయిన్ రోడ్డుకి 1 కి.మీ. 2వ బిట్టు 33 సెంట్లు E/N/F 30ft./20ft. Road Nr. AP మోడల్ జూనియర్ కాలేజ్, గవర్నమెంట్ హాస్పిటల్ వెనుక & 2 రోడ్ కార్నర్. డెవలప్‌డ్ ఏరియా. సంప్ర॥ 8309494629, 9885180930
AJV_204583

HOUSE FOR SALE

★ రెడ్డి కంచరపాలెం ఆర్చ్ దగ్గర 124 గజాల్లో E/N Facing లో 3 అంతస్తుల బిల్డింగ్ అమ్మబడును. సంప్ర॥ 8897852955, 7013905667
AJV_205027

BUSINESS OFFER

★ రూ.30 వేలు నుండి 50 వేలు పెట్టుబడితో మీ ఇంటి వద్దనే వర్క్ చేసుకుంటూ నెలకు 10 వేలు నుండి 15 వేలు వరకు సంపాదించుకోవచ్చును. సంప్ర॥ 9885555841
AJV_205028

FOR SALE

★ రెస్టారెంట్ అమ్మకం. పెందుర్తి (వయా అరకు రోడ్)లో మంచి రన్నింగ్ బిజినెస్‌లో ఉన్న మరియు అన్ని రకముల ఎక్విప్‌మెంట్‌తో అమ్మకం. సంప్ర॥ 7799234582, 9381863550
AJV_204584

FINANCIAL SERVICES

Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు నెలవారీ పద్ధతిలో గాని, సులభ వాయిదా పద్ధతిలో గాని 50 వేల నుండి 5 లక్షలు వరకు ఫైనాన్స్ చేయబడును. Reg.No. 136/2009, Cont: 9am to 8 pm, సెల్: 96665 47338.
AJD:199728

FLAT FOR SALE

★ First Floor apartment with covered parking in Madhurawada. Mobile : 7382235808. WhatsApp 1-631-300-6572
AJH-33345

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176, 9966165093





ఘనంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం వేకువజామున ప్రభాతారాధనలు పూర్తి చేశాక ఉత్సవ మూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో వేదికపై అధిష్ఠింపజేసి శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.









ముసురు

విశాఖపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో జిల్లాలో శనివారం ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకూ దఫదఫాలుగా ఒక మోస్తరు వర్షం కురుస్తూనే ఉంది. వర్షంతో పాటు చలిగాలులు వీయడంతో పనులపై బయటకు వచ్చినవారు ఇబ్బంది పడ్డారు. కాగా శనివారం రాత్రి జిల్లాలో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారం జిల్లాలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కాగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు మధురవాడ వాంబే కాలనీలో 20 మిల్లీమీటర్లు, మారికవలసలో 19.5 మి.మీ., భీమిలిలో 15 మి.మీ. వర్షపాతం నమోదైంది.

93 శాతం పింఛన్లు పంపిణీ

విశాఖపట్నం, నవంబరు (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సామాజిక పింఛన్లు ఈసారి ఒకరోజు ముందుగానే పంపిణీ చేశారు. శనివారం సాయంత్రం వరకూ 1,61,584 మందికిగాను 1,51,193 (93శాతం) మందికి రూ.65,10,25,500 పంపిణీ చేశారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో శనివారం పింఛన్ పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో తుఫాన్ ప్రభావంతో శనివారం ఉదయం నుంచి ముసురు వాతావరణం ఉన్నా సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. కొన్నిచోట్ల ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి పింఛన్లు అందజేశారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మూడు నెలల వరకూ పింఛన్లు తీసుకునే వెసులుబాటు ఉండడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు కొందరు పింఛన్లు తీసుకోలేదు. వచ్చే రెండు, మూడు రోజుల్లో కూడా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

మాజీ మంత్రి చెప్పారని ఇద్దరికి అప్పన్న కండువాలు

సింహాచలం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి చెప్పారని ఆయన వెంట వచ్చిన ఇద్దరికి అప్పన్న ఆలయ సిబ్బంది కండువాలు వేసి గౌరవించడం చర్చనీయాంశమైంది. వైసీపీ హయాంలో దేవదాయశాఖ మంత్రిగా చేసిన కొట్టు సత్యనారాయణ తన అనుచరులు ఇద్దరితో కలిసి శనివారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. మంత్రులకు, ఆలయ దాతలు, ఇతర ప్రముఖులకు మాత్రమే గౌరవ సూచకంగా కండువాలు వేయడం ఆచారంగా వస్తోంది. అయితే మాజీ మంత్రి చెప్పారని అనుచరులకు కండువాలు వేయడం గమనార్హం. అలాగే ఉదయం 11.30 గంటలకు స్వామివారి రాజభోగం నివేదనను సుమారు 14 నిమిషాల ఆలస్యంగా నిర్వహించడం పట్ల భక్తుల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి.





మహిళలకు కంప్యూటర్ శిక్షణ

విశాఖపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (స్కిల్ హబ్) ఆధ్వర్యంలో విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఉచితంగా కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. ఈ కోర్సుల్లో చేరాలనుకునే మహిళలకు పది లేదా ఇంటర్మీడియట్ అర్హత ఉండాలన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశం కల్పించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గలవారు డిసెంబరు 3లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 91216 76360 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

అంతర్జాతీయ కరాటే టోర్నీ రిఫరీగా సతీష్‌కుమార్

విశాఖపట్నం స్పోర్ట్సు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన పీఆర్ కమిషన్ చైర్మన్, వాడో క్రై కరాటే సంఘం అధ్యక్షుడు చిగురుపల్లి సతీష్‌కుమార్ నియమితులయ్యారు. ఆలిండియా వాడో క్రై కరాటే



అసోసియేషన్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వడోదరలో జరిగే 20వ డబ్ల్యుకెఐ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌సిప్ టోర్నీకి సతీష్‌కుమార్ రిఫరీగా వ్యవహరిస్తారు. ఆయనను రిఫరీగా నియమించడంపై కరాటే సంఘాల ప్రతినిధులు, ఇన్‌స్ట్రక్టర్లు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు ప్రజారోగ్య సదస్సు

కంచరపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెంలోని డాక్టరు కూటికుప్పల సూర్యారావు ఆసుపత్రిలో ఆదివారం ఉచిత ప్రజారోగ్య వైజ్ఞానిక సదస్సు నిర్వహించనున్నట్టు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. సాధారణ, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తూ, రోగులకు ఉచితంగా మందులు అందజేస్తామని పేర్కొన్నారు. డిసెంబరు 1 నుంచి 30 వరకు నిర్వహించనున్న ఈ సదస్సులో ఉచిత వైద్యం పొందాలనుకునే వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కొత్త కార్యవర్గం

సీతంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ కమిటీని విశాఖపట్నం జిల్లాకు ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జి.శశిభూషణ్‌రావు, అధ్యక్షుడిగా ఆర్.సురేష్, ప్రధాన కార్యదర్శిగా వి.వీరబ్రహ్మం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేసీహెచ్ నాగరాజు, కోశాధికారిగా ఎంవీవీ గోపీనాథ్, ఉపాధ్యక్షుడిగా ఎన్.మోహన్‌రావులు ఎన్నికయ్యారు.

కార్తీక బ్రహ్మోత్సవాల వ్యాఖ్యాతగా నృసింహ శర్మ

సీతంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో జరుగుతున్న పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో విశాఖకు చెందిన ప్రముఖ రచయిత రాంభట్ల నృసింహ శర్మకు వ్యాఖ్యాతగా వ్యవహరించేందుకు ఆహ్వానం అందింది. డిసెంబరు 2 రాత్రి 7 గంటల నుంచి 9 వరకు గజవాహనం, 3న ఉదయం 8 నుంచి 10 వరకు సర్వభూపాల వాహన సేవలకు రాంభట్ల ప్రత్యేక వ్యాఖ్యాతగా ఉంటారు. ఆయా వాహన సేవల సమయాలలో ప్రత్యేక ప్రసారాన్ని ఎస్వీబీసీలో ప్రసారం చేస్తారు.

16 నుంచి జర్నలిస్టుల క్రికెట్ టోర్నీ

డాబాగార్డెన్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైజాగ్ మీడియా టోర్నీ 2024 విజయవంతం చేయాలని జాతీయ జర్నలిస్టుల కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఏపీడబ్ల్యుజేఎఫ్ అధ్యక్షుడు పి.నారాయణ్ కోరారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో టోర్నీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. డిసెంబరు 16 నుంచి 22 వరకు ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో టోర్నీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గల జర్నలిస్టు క్రీడాకారులు డిసెంబరు 7లోగా తమ టీమ్ జాబితాను నిర్వాహకులకు అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో టోర్నమెంట్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

ఇంటికి చేరిన కాన్పూర్ వాసి



కిషన్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధా ప్రతినిధి

అక్కయ్యపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన మానసిక రోగి కిషన్‌ను అతని కుటుంబ సభ్యులకు శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. కిషన్ వ్యవసాయం చేసేవారని, ఎనిమిదేళ్ల నుంచి మానసిక వ్యాధితో బాధపడుతున్నారని చెప్పారు. ఈ వ్యాధిపై అవగాహన లేని తన తండ్రి మంత్రాలు వేసే వ్యక్తిని ఆశ్రయించడం వల్ల ఆరోగ్యం మరింత క్షీణించిందన్నారు. 5 నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులు ఇచ్చిన మందులతో వ్యాధి నుంచి కోలుకుని చిరునామా చెప్పడంతో వైజాగ్ నుంచి నేరుగా ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ దగ్గర కమలానగర్ గ్రామంలోని అతని తల్లిదండ్రులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడండి

» వివిధ శాఖలకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశం » కనకమహాలక్ష్మి ఆలయంలో అధికారులతో సమీక్ష



కనకమహాలక్ష్మి అమ్మవారికి పూజ చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

జగదాంబ కూడలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి ఆలయంలో జరగనున్న మార్గశిర ఉత్సవాల్లో సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శనివారం దేవస్థానం ప్రాంగణంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. దర్శనం కోసం వచ్చే భక్తులను నిరంతరం పోలీసు బందోబస్తుతో పర్యవేక్షించాలని సూచించారు. ఆలయం వద్ద విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆలయం వద్ద పారిశుధ్యం, తాగునీటి సదుపాయాలు సక్రమంగా ఉండేలా శ్రద్ధ వహించాలని జీవీఎంసీ యంత్రాంగానికి సూచించారు.

ఆర్టీసీ అధికారులు నెలరోజుల పాటు వివిధ ప్రాంతాలకు ప్రత్యేకంగా బస్సులు నడపాలని ఆదేశించారు. టౌన్ కొత్త రోడ్డు వద్ద జగన్నాథుడి దేవాలయంలో నెలరోజులు ఉచిత అన్నప్రసాద వితరణ సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థల సేవలు వినియోగించుకోవాలని కలెక్టర్ ఆలయ అధికారులను ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ఈవో కె.శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ పూజలు: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి శనివారం కలెక్టర్ హరేంధిర ప్రసాద్ విచ్చేసిన సందర్భంగా అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. కలెక్టర్‌తో వేదపండితులు అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేయించారు.

బాలల హక్కులు పరిరక్షించాలి

పూర్ణామార్కెట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కనక మహాలక్ష్మి అమ్మవారి మార్గశిర ఉత్సవాల్లో బాలల హక్కుల పరిరక్షణ కోసం పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. శనివారం దేవస్థానం ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దర్శనం కోసం వేల సంఖ్యలో భక్తులు వస్తారని, వారిలో పిల్లలు కూడా ఉంటారని, వారికి ఆలయ అధికారులు అన్నివిధాలుగా రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. క్యూలైన్లలో పిల్లలకు అన్ని రకాల ఏర్పాట్లు, సౌలభ్యం ఉండేలా దేవస్థానం అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈవో కె.శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషకు గురజాడ సేవలు అనన్యం



గురజాడ జీవిత విశేషాలను వివరిస్తున్న విద్యార్థి

కంచరపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తెలుగు కవి గురజాడ వేంకట అప్పారావు వర్ధంతి సందర్భంగా కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో ఆయనకు శనివారం ఘన నివాళులర్పించారు. సాహితీ స్రవంతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గురజాడ చిత్రపటానికి ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా.రమణ మాట్లాడుతూ తెలుగు భాషకు ఎనలేని సేవలందించిన గురజాడ జీవిత విశేషాలను ప్రతి ఒక్కరూ జ్ఞప్తికి తెచ్చుకోవాలన్నారు. తన రచనల ద్వారా సమాజాన్ని జాగృతం చేసిన విధానాన్ని విద్యార్థులకు వివరించారు. మహనీయుల గొప్పతనాన్ని పుణికిపుచ్చుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు గురజాడ గొప్పతనంపై వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి సంస్థ ప్రతినిధులు పెంటకోట రామారావు, సీహెచ్ సుమిత్ర,పి.భానుమూర్తి, ప్రభాకర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పోర్టు ఆసుపత్రిని ప్రైవేటీకరిస్తే సహించం'



దీక్ష చేస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పోర్టు ఆసుపత్రిని ప్రైవేటీకరిస్తే సహించబోమని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ హెచ్చరించారు. పోర్టు ఆసుపత్రి ఎదుట నిర్వహిస్తున్న నిరాహార దీక్షలు శనివారం 61వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి తమ కష్టార్జితం వల్ల ఏర్పడిందన్నారు. దీన్ని ఎవరికో అమ్ముతామంటే ఊరుకునేది లేదని మండిపడ్డారు. 40 వేల మంది కార్మికుల ఆరోగ్యాన్ని ప్రైవేటు పరం చేస్తుంటే రాజకీయ పార్టీలు ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్రంలోని కూటమి పార్టీలు ప్రశ్నించాలని, అవసరమైతే మద్దతు విరమిస్తామని చెప్పాలన్నారు. లేకుంటే 40 వేల మంది రాష్ట్ర పాలక వర్గానికి మద్దతు విరమించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జక్కాన సత్యనారాయణ, సాంబమూర్తి, కేఎస్ కుమార్, మురళీ పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరునికి ఘనంగా రుద్రాభిషేకం



డాబాగార్డెన్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా శనివారం డాబాగార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవాలయంలో చంద్రమౌళీశ్వరునికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, ఉమాదేవి అమ్మవారికి కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు జి.భార్గవశర్మ సంప్రదాయ రీతిలో స్వామివారిని అలకరించారు. పంచాక్షరీ మంత్రాన్ని పఠిస్తే మానవాళికి కలిగే ప్రయోజనాలను, భగవన్నామస్మరణ ప్రాముఖ్యతను ఎం.వి.రాజశేఖర్ ఆధ్యాత్మిక ప్రసంగం ద్వారా తెలియజేశారు. అధిక సంఖ్యలో భక్తులు రుద్రాభిషేకంలో పాల్గొని చంద్రమౌళీశ్వర స్వామిని దర్శించుకుని పంచాక్షరి మంత్రాన్ని పఠించారు.

ప్రజల్లో సహనం తగ్గుతోంది

» సుప్రీంకోర్టు పూర్వపు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్



'టాప్ హేట్స్ అండ్ టెయిల్ కోట్స్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుప్రీంకోర్టు పూర్వపు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్. చిత్రంలో కాకినాడ శ్రీపీఠాధిపతి పరిపూర్ణానంద సరస్వతి, రచయిత డాక్టర్ ప్రయాగ మురళీమోహనకృష్ణ, డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు

విశాఖపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గడిచిన కొన్నాళ్లుగా దేశంలోని వివిధ వర్గాల్లో ప్రజల్లో సహనం తగ్గుతోందని, ఒకరి అభిప్రాయాన్ని గౌరవించే స్వభావం కొరవడుతోందని సుప్రీంకోర్టు పూర్వపు న్యాయమూర్తి జస్టిస్ జస్టిస్ జాస్తి చలమేశ్వర్ పేర్కొన్నారు. శనివారం ఉదయం ఏయూలోని హిందీ విభాగంలో డాక్టర్ ప్రయాగ మురళీమోహన్‌కృష్ణ రచించిన 'టాప్ హేట్స్ అండ్ టెయిల్ కోట్స్' పుస్తకావిష్కరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నచ్చనిది మాట్లాడితే అవతలి వారిని కించపరిచే పరిస్థితి పెరిగిపోయిందన్నారు. ఎదుటి వ్యక్తిని చిన్నచూపు చూడడమన్నది మనిషి అవలక్షణాల్లో ఒకటిగా మారిపోయిందన్నారు. అవకాశం ఉంటే ఎవరైనా పెత్తనం చేయడానికే యత్నిస్తారని, దీనికి మనిషి రంగుతో సంబంధం లేదన్నారు. తెలంగాణ ఉద్యమం కూడా ఆంధ్రుల పెత్తనం పెరిగిందన్న భావనతో వచ్చిందన్నారు. సాంస్కృతిక యుద్ధంతోనే తెలంగాణ విడిపోయిందన్నారు. సత్యం ఎంతో గొప్పదని, దీని విలువను తెలుసుకుని నడుచుకోవాలన్నారు. కాకినాడ శ్రీపీఠాధిపతి పరిపూర్ణానంద సరస్వతి మాట్లాడుతూ భారతీయుల గొప్పతనాన్ని అంగీకరించే పరిస్థితి ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉందన్నారు. సెక్యులరిజం అంటే హిందువుల చేతులు కట్టేసి, మిగిలిన వారికి స్వేచ్ఛనివ్వడం అన్న చందంగా మారిందన్నారు. పుస్తక రచయిత డాక్టర్ ప్రయాగ మురళీమోహనకృష్ణ మాట్లాడుతూ తెల్లతోలు చూసుకుని అనేక దేశాల్లోని వాళ్ల ఎగురుతుంటారని, అయితే...భారతీయులు ఎందులోనూ వారికి తక్కువ కాదన్నారు. ఈ బుక్ రాయడం వెనుకున్న ఉద్దేశం అదేనన్నారు. సభాధ్యక్షత వహించిన ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని మోదీ వల్ల దేశ గౌరవం ప్రపంచవ్యాప్తంగా పెరిగిందని, భారత దేశాన్ని చూసే దృక్కోణం కూడా మారిందన్నారు. కార్యక్రమంలో అమెరికా నుంచి వచ్చిన సన్యాసిరామ్, పుస్తక ఎడిటర్ శశికళతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

8న ఉత్తరాంధ్ర మాలల 'గర్జన'



గోడప్రతిని ఆవిష్కరిస్తున్న మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు. ఇతర నాయకులు

సీతమ్మధార, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా ఈ నెల 8న ఉత్తరాంధ్ర మాలలు 'గర్జన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు తెలిపారు. రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఇందుకు సంబంధించిన గోడప్రతిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ ఈ సభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిగా తరలివస్తారన్నారు. దళిత ఉద్యమ నాయకులు మల్లేపల్లి లక్ష్మయ్య, మాజీ ఎంపీ జి.వి. హర్షకుమార్, గోపీనాథ్ ఉప్పులేటి, దేవీ ప్రసాద్, పీఎస్ఎన్ మూర్తి, ఎర్రమల్లు రాములు తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. వర్గీకరణ ఆలోచనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దళితుల మధ్య ఐక్యతను దెబ్బతీయడానికి ఇలాంటి చర్యలకు పాలకులు పాల్పడుతున్నారని, దీనికి వ్యతిరేకంగా పోరాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమ కన్వీనర్ పతివాడ రాంబాబు మాట్లాడుతూ ఇప్పటికీ దేశవ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారని, అనేక మంది ఎంపీలు ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్త పోరాటంలో భాగంగా గర్జన ఏర్పాటు చేశామని, దీనికి దళిత, బహుజనులంతా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు డి.కృష్ణ, ఏడీఆర్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గాతాడ జగజ్జీవన్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ కోటేశ్వరరావు, దళిత సేన సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్ల మాల అప్పారావు పాల్గొన్నారు.

15న నేవీ మారథాన్‌ను విజయవంతం చేయాలి

» జిల్లా కలెక్టర్ పిలుపు

మహారాణిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 15న జరిగే నేవీ మారథాన్‌ను సమష్టి కృషితో విజయవంతం చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. నేవీ మారథాన్‌లో సుమారు 13 వేల మంది భాగస్వామ్యం కానున్నందున దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని సూచించారు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు, సమైక్యతాభావాన్ని చాటిచెప్పేందుకు ఈ కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఉదయం 4 గంటల నుంచి 11.30 గంటల వరకు విశ్వప్రియా ఫంక్షన్ హాల్ నుంచి ఐఎన్ఎస్ కళింగ వరకు, తిరిగి విశ్వప్రియా ఫంక్షన్ హాల్ వరకు మొత్తం 42 కిలోమీటర్లు మారథాన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సలహా, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, కెప్టెన్ టీఆర్ఎస్ కుమార్, కెప్టెన్ వినోద్, కమాండర్ వైకిషోర్, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సామాన్యుల శ్రేయస్సే లక్ష్యం కావాలి

» సహకార బ్యాంకుల వ్యవస్థపై మానం ఆంజనేయులు ఆకాంక్ష



మానం ఆంజనేయులును సత్కరిస్తున్న అతిథులు

అక్కయ్యపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ బ్యాంకులు కార్పొరేట్ రంగానికి, పెద్ద వ్యాపారులకే రుణాలు ఇస్తున్న నేపథ్యంలో సహకార బ్యాంకులు సామాన్య ప్రజలకు చేయూత ఇవ్వాలని విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ పూర్వ చైర్మన్ మానం ఆంజనేయులు అన్నారు. బ్యాంకు ఆధ్వర్యంలో పోర్టు కళావాణి ఆడిటోరియంలో శనివారం అయనకు అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార బ్యాంకులు ప్రజాస్వామ్యయుతంగా జవాబుదారీతనంతో పని చేయాలని పిలుపునిచ్చారు. సహకారం బ్యాంకులను పాలకవర్గాలు, ఉద్యోగులు, సభ్యులే కాపాడుకోవాలన్నారు. ప్రభుత్వ సహకారం అందని పరిస్థితుల్లో ప్రజలు పరస్పరం సహకరించుకునేందుకు ఏర్పాటు చేసుకున్నవే సహకార సంస్థలని చెప్పారు. ప్రభుత్వ సహకారం తీసుకున్న రోజున సహకార వ్యవస్థ పతనం ప్రారంభమైనట్టేనని అన్నారు. మధ్యతరగతి ప్రజల ఆదాయాలు తగ్గి ఆర్థికంగా క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో బ్యాంకుల్లో పొదుపు మొత్తాలు తగ్గుతున్నాయని తెలిపారు. తమ బ్యాంకు 54 శాఖలతో రూ.7,675 కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహించే స్థాయికి ఎదగడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆంజనేయులును సహకార రంగ ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, కార్మిక, కర్షక సంఘాల ప్రతినిధులు, వీసీబీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, కాకినాడ కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర, ప్రముఖ పారిశ్రామికవేత్త ప్రభాకరరావు, మహారాజా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు వ్యవస్థాపక చైర్మన్ ఎంఆర్‌కే రాజు, ది గుత్తి కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు చైర్మన్, ఏపీ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ జిలాని, కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీపై విచారణ షురూ

... 5వ పేజీ తరువాయి

నిర్ణయాలు తీసుకున్నారు. పాడి రైతులను సభ్యులుగా చేసుకుని ఏర్పాటైన సొసైటీని కంపెనీగా మార్చేశారు. అందులో తన కుటుంబ సభ్యులను డైరెక్టర్లుగా పెట్టుకున్నారు. విశాఖ డెయిరీ పేరుతో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎక్కడికక్కడ భూములు కొన్నారు. వాటి విలువ ఇప్పుడు వందల కోట్ల రూపాయలకు చేరింది. వాటిలో అనేకం చేతులు మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతుల కోసమని నిర్మించిన 'కృషి' ఆస్పత్రిని కార్పొరేట్ సంస్థకు అప్పగించేశారు. మూడేళ్లుగా రైతులకు బోనస్ ఇవ్వడం మానేశారు. ఆ స్థానంలో సర్వసభ్య సమావేశాల్లో కానుకలు ఇస్తున్నారు. పాల ధరలు పెరుగుతుంటే..రైతులకు ఇచ్చే సేకరణ ధరను ఇటీవల తగ్గించేశారు. అదేమిటని ప్రశ్నిస్తే నష్టాలు వస్తున్నాయని సమాధానం చెబుతున్నారు. ఇంత భారీ వ్యాపారం చేస్తుంటే నష్టాలు ఎలా వస్తున్నాయనేది అనుమానం.

● హైదరాబాద్‌లో ఆడారి కుటుంబం సొంతంగా ఒక డెయిరీని పెట్టుకొని దానికి ఇక్కడి నుంచి రోజూ 15 వేల లీటర్ల పాలను సరఫరా చేస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. డెయిరీలో కీలక స్థానాల్లో ఉన్నవారు ఇలాంటి ప్రైవేటు వ్యాపారాలు చేయకూడదంటున్నారు.

● పరవాడ సమీపాన దేవదాయ శాఖ భూమిని డెయిరీ పేరుతో లీజుకు తీసుకొని కుటుంబ సభ్యులతో ఐస్‌క్రీమ్ పార్లర్ పెట్టించారనే మరో అభియోగం.

● డెయిరీ సభ్యులకు ఆడపిల్ల పుడితే లక్ష రూపాయలు, మగబిడ్డ పుడితే రూ.50 వేలు డిపాజిట్ చేయాలని నిర్ణయం ఉంది. దీనికి రూ.25 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. రైతుల పేరుతో వాటిని డెయిరీ పెద్దలు వాడేసుకున్నారనేది ప్రధాన ఆరోపణ.

● నర్సీపట్నం, చినగదిలి, తదితర ప్రాంతాల్లో డెయిరీ పేరుతో 34 ఎకరాల భూములు ఉన్నాయి. అవి సొసైటీ నిధులతో కొనుగోలు చేసినవి. వాటి లెక్కలు సరి చూడాల్సి ఉంది.

● నరవలో డెయిరీ పేరుతో మూడు ఎకరాల భూమి కొనుగోలు చేసి అందులో 90 సెంట్లు కుటుంబ సభ్యుల పేరు మీదకు మార్చేశారని ఆరోపణలు ఉన్నాయి.

● విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం గర్భాంలో 50 ఎకరాలు డెయిరీ పేరున ఉన్నాయి. వాటి సంగతి తేల్చాల్సి ఉంది.

ప్రకృతి ఆధారిత పంటల ఆహారం ఆరోగ్యకరం

» విశాఖ ఆర్గానిక్ మేళాను విజయవంతం చేయండి: జలగం కుమారస్వామి



వివరాలు వెల్లడిస్తున్న కిసాన్ సంఘ్ కార్యవర్గ సభ్యులు

సీతమ్మధార, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో డిసెంబరు 5 నుంచి 8 వరకు ప్రకృతి ఆధారిత పంటల మేళా నిర్వహిస్తున్నామని, విశాఖ ఆర్గానిక్ మేళాను విజయవంతం చేయాలని భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమారస్వామి పిలుపునిచ్చారు. సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీ నక్కవానిపాలెంలోని స్కూల్‌లో కేశవ్ సేనా సమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి ఆధారిత పంటలను ఆహారంగా తీసుకోవడం ఆరోగ్యకరమన్నారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగించి పండించే పంటలు అనారోగ్యం కలిగిస్తాయని, పర్యావరణానికి నష్టం కలుగుతుందని వివరించారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ మాట్లాడుతూ 5న ఉదయం 10 గంటలకు రైతుల సమ్మేళనం, 6న మీ ఆరోగ్యం మీ చేతిలో, 7న ఫుడ్ ప్రాసెసింగ్, 8న మిద్దె తోటలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలెం నేచురల్స్ ప్రతినిధిగా అశోక్, సత్వా నేచురల్స్ ప్రతినిధిగా మధుసూదన్ రెడ్డి, అవని ఆర్గానిక్స్ ఉషా గణపతి రాజు, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌టీఓ, వ్యవస్థాపక కార్యదర్శి జె.వి. రత్నం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నిధులతో మందిరానికి ముఖద్వారం

మాధవధార, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి); విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 51వవార్డు గాంధీనగర్ హరిహర క్షేత్రం శివాలయానికి చేరే దారిలో ఉడాకాలనీ రోడ్డు నుంచి మందిరానికి కొత్త ముఖద్వారం నిర్మిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు తన సొంత నిధులతో ఈ ముఖద్వారం నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఇటీవల స్వర్గస్తులైన తన భార్య వెంకట రమణికుమారి జ్ఞాపకార్థం ఈ ముఖద్వార నిర్మాణం చేపడుతున్నారు. ప్రధాన ముఖద్వారంపై పార్వతీ పరమేశ్వరుల రూపాలు సహా వినాయక ప్రతిమలు, ఎమ్మెల్సీ సతీమణి పేరు, ఎమ్మెల్సీ పేర్లు ఉండేలా ముఖద్వారం డిజైన్ చేశారు. కాలనీ వాసులకు, ఆలయ నిర్వాహకులకు గుడి అభివృద్ధికి కలిసి వచ్చేలా ఈ నిర్మాణాన్ని చేపడుతున్నారు. జనవరి నెలాఖరుకు పనులు పూర్తి చేసి ఆరంభించాలని నిర్దేశించుకున్న మేర పనులు వేగవంతంగా చేపడుతున్నారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు విరాళంతో చేపడుతున్న పనులను ఆలయ కమిటీ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. అనుకున్న సమయానికి పూర్తి చేసేలా వనరులు సమకూరుస్తున్నారు.

మరుగుదొడ్డి ఏర్పాటు చేస్తే ఫిర్యాదు చేస్తారా?

» కనకమహాలక్ష్మి దేవస్థానం ఈవోకు మద్దతుగా నిలిచిన స్థానికులు



రురుగుదొడ్డి ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని స్థానికులతో కలిసి పరిశీలిస్తున్న దేవస్థానం ఈవో కె.శోభారాణి

జగదాంబ కూడలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి దేవస్థానం మార్గశిర మాసోత్సవాల ఏర్పాట్లలో భాగంగా భక్తుల క్యూలైన్లకు దగ్గరగా ఉండే ప్రాంతంలో ఈవో కె.శోభారాణి చెత్తను తొలగించి మరుగుదొడ్డి సౌకర్యం కల్పించారు. ఈ చర్య గిట్టని వైసీపీకి చెందిన కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ కార్యాలయం నుంచి వివరణ కోరడంతో ఈవో మనస్తాపం చెందారు. వాస్తవ పరిస్థితిని తెలియజేస్తూ కలెక్టర్ కార్యాలయానికి ఆమె ప్రత్యుత్తరం పంపారు. గతంలో వైసీపీతో అంటకాగిన కొందరు మార్గశిర మాసోత్సవాల ఏర్పాట్లపై వివాదం సృష్టించే చర్యలకు దిగారంటూ దేవస్థానంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. విక్టోరియా ఆసుపత్రి వైపు మార్గం సీతారాముల గుడి కాలువ వద్ద భక్తుల కోసం నిర్మించిన మరుగుదొడ్లపై కలెకర్ కు తప్పుడు ఫిర్యాదులు చేయించ డం దేవస్థానం అధికారులను కలచివేసింది. ఈ విషయంపై ఈవో కె.శోభారాణి స్థానిక వ్యాపారులు, అమ్మవారి భక్తులతో మాట్లాడి అభిప్రాయ సేకరణ జరిపారు. ఈ విషయంలో వారంతా ఈవోకు మద్దతుగా నిలిచారు. భక్తుల సౌలభ్యం కోసం సీతారాముల గుడి కాలువ వద్ద చెత్త నిల్వ చేసిన ఇనుప తొట్టెలను తొలగించి మరుగుదొడ్డి నిర్మించామన్నారు. దీనిపై కలెక్టర్‌కు తప్పుడు ఫిర్యాదులు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. వాస్తవ పరిస్థితి తెలుసుకున్న కలెక్టర్ నుంచి సానుకూల స్పందన రావడంతో దేవాదాయశాఖ అధికారులు పనుల్లో వేగం పెంచారు. ఉత్సవ ఏర్పాట్లకు ఆటంకం లేకుండా చేసుకోవచ్చని దేవస్థానం ఉద్యోవర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

సంక్షిప్తంగా..

వీఎంఆర్డీఏ చైర్మన్‌ను కలిసిన గవర కార్పొరేషన్ చైర్మన్ సురేంద్ర



ప్రణవ్‌గోపాల్‌ను సత్కరిస్తున్న సురేంద్ర

సిరిపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సిరిపురం వీఎంఆర్డీఏ భవన్‌లోని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వీఎంఆర్డీఏ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అనకాపల్లి 83వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ బోద్దపు ప్రసాద్, 82వ డివిజన్ ఇన్‌చార్జ్ పోలవరపు త్రినాథ్, ఆకుల నానాజీ, వేగి కృష్ణ, బీటీ కుమార్, షేక్ ఆలీ, ఎస్.భానుచందర్, జొన్నాడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అభిషేక్ కృష్ణవీర్‌కు నియామకపత్రం అందజేత



కృష్ణవీర్ అభిషేక్‌కు నియామక పత్రాన్ని ప్రణవ్ గోపాల్

వెంకోజీపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ శనివారం అమెరికాలోని ఈక్వ్యా ఫర్ పీస్ సంస్థ బోర్డు మెంబర్‌గా, డీన్ వాన్ లీవెన్ సెంటర్ ఫర్ పీస్ స్టడీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్‌ను అభినందించారు. ఇది భారత దేశం, విశాఖకు లభించిన గుర్తింపుగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన చాంబర్‌లో ప్రణవ్ గోపాల్.. ఈక్వ్యా ఫర్‌పీస్ సంస్థ నుంచి వచ్చిన నియామక పత్రాన్ని అభిషేక్‌కు శనివారం అందజేశారు.

లా పూర్వ విద్యార్థుల ప్రతిభ

వెంకోజీపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఏయూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లా కళాశాల 2018-2021 బ్యాచ్ విద్యార్థిని విందెల గీత భార్గవి, 2016-19 బ్యాచ్ విద్యార్థిని కెంబూరి నైమిశలు ఇటీవల వెలువడిన ఆంధ్రప్రదేశ్ జూనియర్ సివిల్ జడ్జి ఫలితాలలో విజయం సాధించి చిన్న వయస్సులో జడ్జిలుగా ఎంపికయ్యారు. ఈ విజయంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సీతామాణిక్యం హర్షం వ్యక్తం చేస్తూ గీతభార్గవి, నైమిశలను అభినందించారు.

సినిమా గైడ్

- **మెకానిక్ రాఖీ:** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **దేవకీనందన వాసుదేవ:** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **జీబ్రా:** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
- **కంగువా:** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **లక్కీభాస్కర్:** వెంకటేశ్వర
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 47, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 26, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 30, క్యారెట్ 56 దొండకాయలు 32, బంగాళ దుంపలు 34, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 28 దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 50, కీర దోస 28, కాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడ దుంపలు 32, కంద 58, దేముడు చిక్కుడు 80, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 55, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రరపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	590
విజయనగరం	594
శ్రీకాకుళం	594

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	100
ఫారం ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

మహా నిర్లక్ష్యం

- ఒక చోట సరి చేశారు.. మరో చోట విస్మరించారు
- తాగునీటి పైపులైన్ల మరమ్మతుల్లో జీవీఎంసీ సిబ్బంది తీరు



పాత వెంకోజీపాలెం జంక్షన్‌లో లీక్ అవుతున్న తాగు నీరు



మరమ్మతు చేసిన వాల్వ్

వెంకోజీపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు పాత వెంకోజీపాలెం జంక్షన్‌లో మంచినీటి పైపులైను వాల్ లీకేజీ నియంత్రణకు చర్యలు తీసుకున్న జీవీఎంసీ అధికారులు మరి కాస్త దూరంలోనే మరో పైపులైను లీకేజీ అవుతున్నా చూసీచూడనట్టు వెళ్లిపోయారు. దీంతో అధికారులు, సిబ్బంది వైఖరిపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గత నెల రోజుల కిందట పైపులైన్ లీకేజీతో వృథాపోతున్న తాగునీటిని అరికట్టేందుకు శుక్రవారం జీవీఎంసీ సిబ్బంది పనులు చేపట్టారు. అయితే ఇదే ప్రాంతంలోని పీలా హోమ్స్ ఎదురుగా ఉన్న ప్రధాన పైపులైను గత 20 రోజుల నుంచి లీకేజీ అవుతుండడంతో తాగునీరు వృథా అవుతోంది. దీనిపై అధికారులకు స్థానికులు ఫిర్యాదు కూడా చేశారు. ఒకే ప్రాంతంలో నెల రోజుల కిందట పైపులైన్ లీకేజీ ఏర్పడిన చోట సమస్య పరిష్కారానికి ఆలస్యంగానైనా చర్యలు చేపట్టిన అధికారులు మరో చోట అలాంటి సమస్య ఉన్నా పట్టించుకోకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అంటే కనీసం నెల దాటితే గాని లీకేజీలను అరికట్టే అలవాటు జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగానికి లేదేమోనని పలువురు ఎద్దేవా చేస్తున్నారు.

ప్రతి రోజు ఇదే మార్గంలో క్షేత్ర పర్యటనల్లో భాగంగా జీవీఎంసీ అధికారులు, సిబ్బంది తిరుగుతూనే ఉంటారు. ఈ సమస్యలను వారు గమనించే ఉంటారు. కానీ పరిష్కారానికి మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పీలా హోమ్స్ ఎదురుగా ఏర్పడిన తాగునీటి పైపులైన్ లీకేజీ అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సామాజిక చైతన్యదీప్తి గురజాడ

వర్ధంతి సభలో పలువురు ప్రముఖులు



గురజాడకు నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు

వెంకోజీపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఏయూ తెలుగుశాఖలో నవ సాహితి ఇంటర్నేషనల్, తెలుగు శాఖ సంయుక్త నిర్వహణలో శనివారం తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన గురజాడ 109వ వర్ధంతిని నిర్వహించారు. నవ సాహితి నేషనల్ కన్వీనర్ రాపర్తి ఝాన్సీ తన ప్రసంగంలో గురజాడ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహించాలన్నారు.

తెలుగు శాఖ ఆచార్యులు అన్నంశెట్టి ఈశ్వరమ్మ గురజాడ సాహిత్యంలోని స్త్రీ చైతన్య స్ఫూర్తిని వివరించారు. సామాజిక చైతన్య దీప్తి గురజాడ అని కొనియాడారు. ప్రబంధ కవులు స్త్రీ అంగాంగ వర్ణనలు చేస్తే గురజాడ మహిళా విమోచనానికి సాహిత్యాన్ని సాధనంగా చేసుకున్నారన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.సూర్యారావు గురజాడ తెలుగు సాహిత్యానికి వేగుచుక్క అన్నారు. సాంఘిక దురాచారాలపై ఆయన ప్రయోగించిన శక్తివంతమైన ఆయుధం కన్యాశుల్కం నాటకమని, ఎంతకాలం గడిచినా సజీవంగా నిలిచే దృశ్యకావ్యమని చెప్పారు. తెలుగు శాఖ గౌరవ ఆచార్యుడు వెలమల సిమ్మన్న తదితరులు పాల్గొన్నారు. ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎస్వీ సూర్యప్రకాశరావు తమ సంస్థ చేస్తున్న సాహిత్య కళా రంగాల కృషిని వివరించారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో తెలుగు శాఖ విద్యార్థులతో పాటు నగరంలోని ప్రసిద్ధ కవులు శేఖరమంత్రి ప్రభాకరరావు, మళ్ల జ్యోతిర్మయి, పిళ్లా వెంకట రమణమూర్తి, డాక్టర్ కేవీఎస్ మూర్తి, వడలి అనంతరామ్, డాక్టర్ మాలతి, డాక్టర్ రజని తదితరులు గురజాడపై కవితలు వినిపించారు.

ప్రతిభను ప్రోత్సహించాలి



విద్యార్థులను అభినందిస్తున్న కీర్తి కాబ్రా

సిరిపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ప్రతిభను వెలికితీయడం ద్వారా వారు ఉన్నతంగా ఎదిగే అవకాశం ఉంటుందని ఆర్‌ఆర్ గ్లోబల్ డైరెక్టర్ కీర్తి కాబ్రా అన్నారు. శనివారం సిరిపురం మంత్రీస్‌లో కేబెల్ స్టార్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ 2024 విజేతలను అభినందించారు. ఈ స్కాలర్‌షిప్ పదో తరగతి పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసిన ఎలక్ట్రీషియన్‌ల పిల్లల కోసం రూపొందించడం జరిగిందన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకు ఉపయోగకరమన్నారు. ఈ సందర్భంగా స్కాలర్‌షిప్ విజేతలను తల్లిదండ్రుల సమక్షంలో సత్కరించారు.

వర్షంలోనూ పింఛన్ల పంపిణీ



పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి

ఆరిలోవ, నవంబరు 30 : (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డులో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శనివారం ఉదయం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, జోన్-2 కమిషనర్ ఫణిరామ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే 13వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పి. ధర్మారావు, వార్డు కార్యదర్శి యల్లమల్లి సురేష్, సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందజేశారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 1వ తేదీన ఆదివారం రోజు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పింఛన్లను ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు అందజేశారు. శనివారం 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య సచివాలయం సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, మళ్ల రవికుమార్, ఇతర నాయకులు పాల్గొన్నారు. అలాగే 16వ వార్డు టీడీపీ అధ్యక్షుడు నారు గోపి, ముగడ వాసు, మొల్లి శంకర్, పల్లా ఉమారాణి, మొల్లి శోభ, నూకరాజు, జి.అప్పన్నలు వార్డులోని లబ్ధిదారులకు సచివాలయం సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేశారు.

మద్దిలపాలెంలో..

మద్దిలపాలెం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 22వ వార్డులో శనివారం జోరువానలో టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచే గడప గడపకూ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. ఒకరోజు ముందే నగదు చేతికి అందడంతో పింఛన్‌దారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బొట్టా వెంకటరమణ మాట్లాడుతూ 22వ వార్డులోని 7 సచివాలయాల్లో 90 శాతం పింఛన్లు అందించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, దువ్వి రాజ్‌కుమార్, బర్ల రాజు, డేవిడ్, చిన్నారావు, గుణలక్ష్మి జయమ్మ పాల్గొన్నారు.

పెదవాల్తేరులో..

పెదవాల్తేరు, నవంబరు 30 : జీవీఎంసీ 20వ వార్డులోని పెదవాల్తేరు, గాంధీ బొమ్మసెంటర్, కొత్తపేట, మద్దివారి వీధి, ముసనబువారి వీధి తదితర ప్రాంతాల్లో శనివారం పింఛన్లు అందజేశారు.

శాసనమండలి సభ్యుడు వేపాడ చిరంజీవిరావు పలువురికి పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చైన్‌స్నాచర్ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటరావు ఇతర అధికారులు

ఎంవీపీ కాలనీ/ ఆరిలోవ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ చేసిన నిందితుడిని ద్వారకా జోన్ నేర విభాగం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏసీపీ వెంకటరావు కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

ఆరిలోవ స్టేషన్ పరిధిలోని వివేకానందనగర్‌లో కుప్పా అప్పయ్యమ్మ అనే మహిళ ఈ నెల 22న తన ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా ఆమె మెడలోని రెండు తులాల పుస్తెల తాడును దుండగుడు తెంచుకుని పరారయ్యాడు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆరిలోవ కాలనీ దుర్గాబజారు ప్రాంతానికి చెందిన కుప్పా వెంకట గౌతమ్(23) నిందితుడిగా గుర్తించి అరెస్టు చేశారు. చోరీ చేసిన పుస్తెల తాడును అతడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో చురుగ్గా వ్యవహరించిన సీఐ బంగారు పాప, ఆరిలోవ ఎస్‌ఐ హరికృష్ణ, సిబ్బందినిఉన్నతాధికారులు అభినందించారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెలగపూడి శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు

ఆరిలోవ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 10వ వార్డులోని సుందర్‌నగర్ కొండవాలు ప్రాంతంలో జీవీఎంసీ నిధులు రూ.36 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపనలు చేశారు. స్థానిక కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి ఆధ్వర్యంలో ఈ శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వార్డులో రోడ్డుల, డ్రైన్లు, యూజీడీ పనులు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జోన్-2 కమిషనర్ ఫణిరాం, టీడీపీ వార్డు ఇన్‌చార్జి రాజశేఖర్, టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

గాయత్రీ కళాశాలలో ఆర్డునో ప్రోగ్రామింగ్‌లో నూతన కోర్సు



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని గాయత్రీ కళాశాలలో ఎలక్ట్రానిక్ విభాగం ఆధ్వర్యంలో ఆర్డునో ప్రోగ్రామింగ్‌లో కొత్తగా స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు ప్రారంభించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో టెకీబోట్ సీఈవో ఎస్.వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆర్డినో అనేది ఎలక్ట్రానిక్స్ ప్రాజెక్టులను నిర్మించడానికి, ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఓపెన్ సోర్స్ ప్లాట్‌ఫామ్, రోబోటిక్స్ హోమ్ ఆటోమేషన్ వంటి పరిశ్రమల్లో అప్లికేషన్లు, ఆరోగ్య సంరక్షణకు, సృజనాత్మకత వంటి అంశాలకు సంబంధించిన నూతన కోర్సులు ప్రవేశపెట్టడానికి ఉపయోగపడుతుందని అన్నారు. కళాశాల డైరెక్టర్ గిరిధర్, ప్రిన్సిపాల్ కేఎస్ బోస్, విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి తదితరులు ప్రసంగించారు.

ఇంటర్ వర్సిటీ పోటీలకు ఏయూ పురుషులు కరాటే జట్టు ఎంపిక



ఎంపికైన జట్టును అభినందిస్తున్న రిజిస్ట్రార్

వెంకోజీపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కరాటే పురుషుల పోటీలలో పాల్గొనే ఏయూ కరాటే పురుషుల జట్టును ఎంపిక చేసినట్టు క్రీడా విభాగ సంచాలకుడు ఎన్.విజయమోహన్ తెలిపారు. ఏడుగురు సభ్యులతో కూడిన ఈ బృందం సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటుంది. భోపాల్‌లోని ఎల్‌ఎన్‌సీటీ యూనివర్సిటీలో డిసెంబరు 3 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే పోటీలకు ఏయూ తరుపున వీరు ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయ రావు తన కార్యాలయంలో శనివారం అభినందించారు. ఎంపికైన క్రీడాకారులను క్రీడా విభాగాధిపతి ఎ.పల్లవి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కరాటే కోచ్ కె.చిన్నారావు పాల్గొన్నారు.

జీవీఎంసీ రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం



రిటైర్డు ఉద్యోగులు సన్మానిస్తున్న దృశ్యం

వెంకోజీపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన పలువురికి శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ మాట్లాడుతూ.. శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి అప్పలనాయుడు, సూపరింటెండెంట్లు రియాజ్, వి.సన్యాసిరావు, రెవెన్యూ అధికారి రామనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర మాలల గర్జనను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న నేతలు, కార్యకర్తలు

కొమ్మాది, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 8న గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించనున్న ఉత్తరాంధ్ర మాలల గర్జనను విజయవంతం చేయాలని మాలనాయకుడు పతివాడ రాంబాబు పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ మాలలంతా పోరాడాలని పిలుపునిచ్చారు. శనివారం కొమ్మాదిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాలల గర్జన పోస్టరు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు, షిప్పింగ్ కార్పొరేషన్ ఇండిపెండెంట్ డైరెక్టర్ చక్రవర్తి, సియాద్రి కనకరాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో వెంకన్న

- ఘనంగా కార్తీక మాసం ఆఖరి శనివారం పూజలు



కమలం పుష్పాలు, తులసి దళాలతో అలంకృతుమైన స్వామి

వెంకోజీపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం ఆఖరి శనివారం పురస్కరించుకుని వెంకన్న ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో వెంకన్నస్వామిని తులసి మాలలతో అలంకరించారు. ఆలయ అర్చకులు వెంకటరమణాచార్యులు, గోపాలకృష్ణలు భక్తుల పేరిట ప్రత్యేక అభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి ఎం.సావిత్రి, కోశాధికారి కె.సుబ్బారాయుడు, మేనేజరు బి.సన్యాసిరావు పాల్గొన్నారు.

అలాగే కొత్త వెంకోజీపాలెంలోని రామాలయంలో వేంచేసి ఉన్న శ్రీవైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో 1200 కమలం పుష్పాలతో వెంకన్న స్వామిని సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. అర్చకులు కిషోర్ శర్మ భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేశారు.

బాదంగీర్ సాయి సేవలు చిరస్మరణీయం



బాదంగీర్ సాయికి నివాళులు అర్పిస్తున్న కళాకారుల సంఘాల నేతలు

మద్దిలపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శనివారం రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో బాదంగీర్ సాయి సంస్మరణ సభ ఘనంగా నిర్వహించారు. సినీ నటుడు జబర్దస్త్ అప్పారావు,

రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, కళాకారుల సంఘ నాయకులు బాదంగీర్ సాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జబర్దస్త్ అప్పారావు మాట్లాడుతూ కళలు, నాటక రంగానికి సాయి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. నాటక రంగానికి జీవం పోస్తూ సేవకే సాయి ప్రాధాన్యమిచ్చారన్నారు.వీవీ రమణమూర్తి మాట్లాడుతూ ఆర్థికపరమైన ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా నాటకాలను విజయవంతం చేయడానికి సాయి చేసిన కృషి విశేషమైనదన్నారు. కళారంగానికి సాయి చేసిన సేవలకు గుర్తింపుగా నగరంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కళాభారతి అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ ప్రతి ఏడాది డిసెంబరు మొదటి శుక్రవారం బాదంగీర్ సాయి వర్ధంతిని నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, శివజ్యోతి, విటల్ కుమార్, రాంబాబు, మేడా మస్తాన్‌రెడ్డి, యాదకుమార్, విక్రమ్ గౌడ్, ఈశ్వరరావుపాల్గొన్నారు.

విశాఖ వేలి స్కూల్‌లో క్యాచ్ దెమ్ యంగ్ ప్రాజెక్టు ప్రారంభం



ప్రతిజ్ఞ చేస్తున్న విశాఖవేలి ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరీ ప్రభాకర్, అధ్యాపకులు

ఆరిలోవ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వ్యర్థ పదార్థాల నుంచి సంపద సృష్టించడాన్ని ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్న అంతర్జాతీయ సంస్థ ఐకాన్ ఫౌండేషన్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో కలసి విశాఖ వేలి స్కూలులో క్యాచ్‌దెమ్‌యంగ్-జీరోవేస్ట్ అండ్ సర్క్యులర్ ఎకానమీ ఇన్ క్యాంపస్ ప్రాజెక్టును శనివారం ప్రారంభించారు. ఐకాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ సాధనకుమార్ గోష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో 152 పాఠశాలలో రెండు లక్షల మంది విద్యార్థులు ఈ ప్రాజెక్టులో ఇప్పటి వరకూ భాగస్వామ్యులు అయ్యారని తెలిపారు. విశాఖ వేలి స్కూలులో ప్రాజెక్టు ద్వారా నగరంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, పాఠశాల ఆవరణలో మూడు రకాల డస్ట్‌బిన్‌లు ఏర్పాటు ద్వారా వ్యర్థాలను సేకరించి వాటిని తిరిగి ఉపయుక్తమైన వస్తువుల తయారీకి ఏ విధంగా ఉపయోగించవచ్చో అవగాహన కల్పిస్తామన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఈ ప్రాజెక్టు విజయవంతమైందని ఆయన పేర్కొన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో ప్రారంభమైన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరీప్రభాకర్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. వ్యర్థాల నివారణ, విద్యార్థులలో అవగాహనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

మహిళలకు కంప్యూటర్ శిక్షణ

విశాఖపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (స్కిల్ హబ్) ఆధ్వర్యంలో విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఉచితంగా కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. ఈ కోర్సుల్లో చేరాలనుకునే మహిళలకు పది లేదా ఇంటర్మీడియట్ అర్హత ఉండాలన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశం కల్పించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గలవారు డిసెంబరు 3లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 91216 76360 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

అంతర్జాతీయ కరాటే టోర్నీ రిఫరీగా సతీష్‌కుమార్



విశాఖపట్నం స్పోర్ట్సు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన పీఆర్ కమిషన్ చైర్మన్, వాడో క్రై కరాటే సంఘం అధ్యక్షుడు చిగురుపల్లి సతీష్‌కుమార్ నియమితులయ్యారు. ఆలిండియా వాడో క్రై కరాటే అసోసియేషన్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వడోదరలో జరిగే 20వ డబ్ల్యుకెఐ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌సిప్ టోర్నీకి సతీష్‌కుమార్ రిఫరీగా వ్యవహరిస్తారు. ఆయనను రిఫరీగా నియమించడంపై కరాటే సంఘాల ప్రతినిధులు, ఇన్‌స్ట్రక్టర్లు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు ప్రజారోగ్య సదస్సు

కంచరపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెంలోని డాక్టరు కూటికుప్పల సూర్యారావు ఆసుపత్రిలో ఆదివారం ఉచిత ప్రజారోగ్య వైజ్ఞానిక సదస్సు నిర్వహించనున్నట్టు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. సాధారణ, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తూ, రోగులకు ఉచితంగా మందులు అందజేస్తామని పేర్కొన్నారు. డిసెంబరు 1 నుంచి 30 వరకు నిర్వహించనున్న ఈ సదస్సులో ఉచిత వైద్యం పొందాలనుకునే వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కొత్త కార్యవర్గం

సీతంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ కమిటీని విశాఖపట్నం జిల్లాకు ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జి.శశిభూషణ్‌రావు, అధ్యక్షుడిగా ఆర్.సురేష్, ప్రధాన కార్యదర్శిగా వి.వీరబ్రహ్మం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేసీహెచ్ నాగరాజు, కోశాధికారిగా ఎంవీవీ గోపినాథ్, ఉపాధ్యక్షుడిగా ఎన్.మోహన్‌రావులు ఎన్నికయ్యారు.

కార్తీక బ్రహ్మోత్సవాల వ్యాఖ్యాతగా నృసింహ శర్మ

సీతంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో జరుగుతున్న పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో విశాఖకు చెందిన ప్రముఖ రచయిత రాంభట్ల నృసింహ శర్మకు వ్యాఖ్యాతగా వ్యవహరించేందుకు ఆహ్వానం అందింది. డిసెంబరు 2 రాత్రి 7 గంటల నుంచి 9 వరకు గజవాహనం, 3న ఉదయం 8 నుంచి 10 వరకు సర్వభూపాల వాహన సేవలకు రాంభట్ల ప్రత్యేక వ్యాఖ్యాతగా ఉంటారు. ఆయా వాహన సేవల సమయాలలో ప్రత్యేక ప్రసారాన్ని ఎస్వీబీసీలో ప్రసారం చేస్తారు.

16 నుంచి జర్నలిస్టుల క్రికెట్ టోర్నీ

డాబాగార్డెన్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైజాగ్ మీడియా టోర్నీ 2024 విజయవంతం చేయాలని జాతీయ జర్నలిస్టుల కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఏపీడబ్ల్యుజేఎఫ్ అధ్యక్షుడు పి.నారాయణ్ కోరారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో టోర్నీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. డిసెంబరు 16 నుంచి 22 వరకు ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో టోర్నీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గల జర్నలిస్టు క్రీడాకారులు డిసెంబరు 7లోగా తమ టీమ్ జాబితాను నిర్వాహకులకు అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో టోర్నమెంట్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

ఇంటికి చేరిన కాన్పూర్ వాసి



కిషన్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధా ప్రతినిధి

అక్కయ్యపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన మానసిక రోగి కిషన్‌ను అతని కుటుంబ సభ్యులకు శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. కిషన్ వ్యవసాయం చేసేవారని, ఎనిమిదేళ్ల నుంచి మానసిక వ్యాధితో బాధపడుతున్నారని చెప్పారు. ఈ వ్యాధిపై అవగాహన లేని తన తండ్రి మంత్రాలు వేసే వ్యక్తిని ఆశ్రయించడం వల్ల ఆరోగ్యం మరింత క్షీణించిందన్నారు. 5 నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులు ఇచ్చిన మందులతో వ్యాధి నుంచి కోలుకుని చిరునామా చెప్పడంతో వైజాగ్ నుంచి నేరుగా ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ దగ్గర కమలానగర్ గ్రామంలోని అతని తల్లిదండ్రులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడండి

» వివిధ శాఖలకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశం » కనకమహాలక్ష్మి ఆలయంలో అధికారులతో సమీక్ష



కనకమహాలక్ష్మి అమ్మవారికి పూజ చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

జగదాంబ కూడలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి ఆలయంలో జరగనున్న మార్గశిర ఉత్సవాల్లో సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శనివారం దేవస్థానం ప్రాంగణంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. దర్శనం కోసం వచ్చే భక్తులను నిరంతరం పోలీసు బందోబస్తుతో పర్యవేక్షించాలని సూచించారు. ఆలయం వద్ద విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆలయం వద్ద పారిశుధ్యం, తాగునీటి సదుపాయాలు సక్రమంగా ఉండేలా శ్రద్ధ వహించాలని జీవీఎంసీ యంత్రాంగానికి సూచించారు.

ఆర్టీసీ అధికారులు నెలరోజుల పాటు వివిధ ప్రాంతాలకు ప్రత్యేకంగా బస్సులు నడపాలని ఆదేశించారు. టౌన్ కొత్త రోడ్డు వద్ద జగన్నాథుడి దేవాలయంలో నెలరోజులు ఉచిత అన్నప్రసాద వితరణ సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థల సేవలు వినియోగించుకోవాలని కలెక్టర్ ఆలయ అధికారులను ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ఈవో కె.శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ పూజలు: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి శనివారం కలెక్టర్ హరేంధిర ప్రసాద్ విచ్చేసిన సందర్భంగా అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. కలెక్టర్‌తో వేదపండితులు అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేయించారు.

బాలల హక్కులు పరిరక్షించాలి

పూర్ణామార్కెట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కనక మహాలక్ష్మి అమ్మవారి మార్గశిర ఉత్సవాల్లో బాలల హక్కుల పరిరక్షణ కోసం పటిష్ఠ చర్యలు చేపట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. శనివారం దేవస్థానం ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దర్శనం కోసం వేల సంఖ్యలో భక్తులు వస్తారని, వారిలో పిల్లలు కూడా ఉంటారని, వారికి ఆలయ అధికారులు అన్నివిధాలుగా రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. క్యూలైన్లలో పిల్లలకు అన్ని రకాల ఏర్పాట్లు, సౌలభ్యం ఉండేలా దేవస్థానం అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈవో కె.శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషకు గురజాడ సేవలు అనన్యం



గురజాడ జీవిత విశేషాలను వివరిస్తున్న విద్యార్థి

కంచరపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తెలుగు కవి గురజాడ వేంకట అప్పారావు వర్ధంతి సందర్భంగా కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో ఆయనకు శనివారం ఘన నివాళులర్పించారు. సాహితీ స్రవంతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గురజాడ చిత్రపటానికి ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా.రమణ మాట్లాడుతూ తెలుగు భాషకు ఎనలేని సేవలందించిన గురజాడ జీవిత విశేషాలను ప్రతి ఒక్కరూ జ్ఞప్తికి తెచ్చుకోవాలన్నారు. తన రచనల ద్వారా సమాజాన్ని జాగృతం చేసిన విధానాన్ని విద్యార్థులకు వివరించారు. మహనీయుల గొప్పతనాన్ని పుణికిపుచ్చుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు గురజాడ గొప్పతనంపై వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి సంస్థ ప్రతినిధులు పెంటకోట రామారావు, సీహెచ్ సుమిత్ర,పి.భానుమూర్తి, ప్రభాకర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరునికి ఘనంగా రుద్రాభిషేకం



డాబాగార్డెన్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా శనివారం డాబాగార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవాలయంలో చంద్రమౌళీశ్వరునికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, ఉమాదేవి అమ్మవారికి కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు జి.భార్గవశర్మ సంప్రదాయ రీతిలో స్వామివారిని అలకరించారు. పంచాక్షరీ మంత్రాన్ని పఠిస్తే మానవాళికి కలిగే ప్రయోజనాలను, భగవన్నామస్మరణ ప్రాముఖ్యతను ఎం.వి.రాజశేఖర్ ఆధ్యాత్మిక ప్రసంగం ద్వారా తెలియజేశారు. అధిక సంఖ్యలో భక్తులు రుద్రాభిషేకంలో పాల్గొని చంద్రమౌళీశ్వర స్వామిని దర్శించుకుని పంచాక్షరి మంత్రాన్ని పఠించారు.

'పోర్టు ఆసుపత్రిని ప్రైవేటీకరిస్తే సహించం'



దీక్ష చేస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పోర్టు ఆసుపత్రిని ప్రైవేటీకరిస్తే సహించబోమని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ హెచ్చరించారు. పోర్టు ఆసుపత్రి ఎదుట నిర్వహిస్తున్న నిరాహార దీక్షలు శనివారం 61వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి తమ కష్టార్జితం వల్ల ఏర్పడిందన్నారు. దీన్ని ఎవరికో అమ్ముతామంటే ఊరుకునేది లేదని మండిపడ్డారు. 40 వేల మంది కార్మికుల ఆరోగ్యాన్ని ప్రైవేటు పరం చేస్తుంటే రాజకీయ పార్టీలు ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్రంలోని కూటమి పార్టీలు ప్రశ్నించాలని, అవసరమైతే మద్దతు విరమిస్తామని చెప్పాలన్నారు. లేకుంటే 40 వేల మంది రాష్ట్ర పాలక వర్గానికి మద్దతు విరమించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జక్కాన సత్యనారాయణ, సాంబమూర్తి, కేఎస్ కుమార్, మురళీ పాల్గొన్నారు.

ప్రజల్లో సహనం తగ్గుతోంది

» సుప్రీంకోర్టు పూర్వపు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్



'టాప్ హేట్స్ అండ్ టెయిల్ కోట్స్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుప్రీంకోర్టు పూర్వపు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్. చిత్రంలో కాకినాడ శ్రీపీఠాధిపతి పరిపూర్ణానంద సరస్వతి, రచయిత డాక్టర్ ప్రయాగ మురళీమోహనకృష్ణ, డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు

విశాఖపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గడిచిన కొన్నాళ్లుగా దేశంలోని వివిధ వర్గాల్లో ప్రజల్లో సహనం తగ్గుతోందని, ఒకరి అభిప్రాయాన్ని గౌరవించే స్వభావం కొరవడుతోందని సుప్రీంకోర్టు పూర్వపు న్యాయమూర్తి జస్టిస్ జస్టిస్ జాస్తి చలమేశ్వర్ పేర్కొన్నారు. శనివారం ఉదయం ఏయూలోని హిందీ విభాగంలో డాక్టర్ ప్రయాగ మురళీమోహన్‌కృష్ణ రచించిన 'టాప్ హేట్స్ అండ్ టెయిల్ కోట్స్' పుస్తకావిష్కరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నచ్చనిది మాట్లాడితే అవతలి వారిని కించపరిచే పరిస్థితి పెరిగిపోయిందన్నారు. ఎదుటి వ్యక్తిని చిన్నచూపు చూడడమన్నది మనిషి అవలక్షణాల్లో ఒకటిగా మారిపోయిందన్నారు. అవకాశం ఉంటే ఎవరైనా పెత్తనం చేయడానికే యత్నిస్తారని, దీనికి మనిషి రంగుతో సంబంధం లేదన్నారు. తెలంగాణ ఉద్యమం కూడా ఆంధ్రుల పెత్తనం పెరిగిందన్న భావనతో వచ్చిందన్నారు. సాంస్కృతిక యుద్ధంతోనే తెలంగాణ విడిపోయిందన్నారు. సత్యం ఎంతో గొప్పదని, దీని విలువను తెలుసుకుని నడుచుకోవాలన్నారు. కాకినాడ శ్రీపీఠాధిపతి పరిపూర్ణానంద సరస్వతి మాట్లాడుతూ భారతీయుల గొప్పతనాన్ని అంగీకరించే పరిస్థితి ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉందన్నారు. సెక్యులరిజం అంటే హిందువుల చేతులు కట్టేసి, మిగిలిన వారికి స్వేచ్ఛనివ్వడం అన్న చందంగా మారిందన్నారు. పుస్తక రచయిత డాక్టర్ ప్రయాగ మురళీమోహనకృష్ణ మాట్లాడుతూ తెల్లతోలు చూసుకుని అనేక దేశాల్లోని వాళ్లు ఎగురుతుంటారని, అయితే...భారతీయులు ఎందులోనూ వారికి తక్కువ కాదన్నారు. ఈ బుక్ రాయడం వెనుకున్న ఉద్దేశం అదేనన్నారు. సభాధ్యక్షత వహించిన ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని మోదీ వల్ల దేశ గౌరవం ప్రపంచవ్యాప్తంగా పెరిగిందని, భారత దేశాన్ని చూసే దృక్కోణం కూడా మారిందన్నారు. కార్యక్రమంలో అమెరికా నుంచి వచ్చిన సన్యాసిరామ్, పుస్తక ఎడిటర్ శశికళతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

8న ఉత్తరాంధ్ర మాలల 'గర్జన'



గోడప్రతిని ఆవిష్కరిస్తున్న మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు. ఇతర నాయకులు

సీతమ్మధార, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా ఈ నెల 8న ఉత్తరాంధ్ర మాలలు 'గర్జన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు తెలిపారు. రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఇందుకు సంబంధించిన గోడప్రతిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ ఈ సభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిగా తరలివస్తారన్నారు. దళిత ఉద్యమ నాయకులు మల్లేపల్లి లక్ష్మయ్య, మాజీ ఎంపీ జి.వి. హర్షకుమార్, గోపీనాథ్ ఉప్పులేటి, దేవీ ప్రసాద్, పీఎస్ఎన్ మూర్తి, ఎర్రమల్లు రాములు తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. వర్గీకరణ ఆలోచనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దళితుల మధ్య ఐక్యతను దెబ్బతీయడానికి ఇలాంటి చర్యలకు పాలకులు పాల్పడుతున్నారని, దీనికి వ్యతిరేకంగా పోరాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమ కన్వీనర్ పతివాడ రాంబాబు మాట్లాడుతూ ఇప్పటికీ దేశవ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారని, అనేక మంది ఎంపీలు ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్త పోరాటంలో భాగంగా గర్జన ఏర్పాటు చేశామని, దీనికి దళిత, బహుజనులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు డి.కృష్ణ, ఏబీఆర్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గాతాడ జగ్జీవన్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ కోటేశ్వరరావు, దళిత సేన సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్ల మాల అప్పారావు పాల్గొన్నారు.

15న నేవీ మారథాన్‌ను విజయవంతం చేయాలి

» జిల్లా కలెక్టర్ పిలుపు

మహారాణిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 15న జరిగే నేవీ మారథాన్‌ను సమష్టి కృషితో విజయవంతం చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. నేవీ మారథాన్‌లో సుమారు 13 వేల మంది భాగస్వామ్యం కానున్నందున దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని సూచించారు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు, సమైక్యతాభావాన్ని చాటిచెప్పేందుకు ఈ కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఉదయం 4 గంటల నుంచి 11.30 గంటల వరకు విశ్వప్రియా ఫంక్షన్ హాల్ నుంచి ఐఎన్ఎస్ కళింగ వరకు, తిరిగి విశ్వప్రియా ఫంక్షన్ హాల్ వరకు మొత్తం 42 కిలోమీటర్లు మారథాన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సలహా, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, కెప్టెన్ టీఆర్ఎస్ కుమార్, కెప్టెన్ వినోద్, కమాండర్ వైకిషోర్, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సామాన్యుల శ్రేయస్సే లక్ష్యం కావాలి

» సహకార బ్యాంకుల వ్యవస్థపై మానం ఆంజనేయులు ఆకాంక్ష



మానం ఆంజనేయులును సత్కరిస్తున్న అతిథులు

అక్కయ్యపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ బ్యాంకులు కార్పొరేట్ రంగానికి, పెద్ద వ్యాపారులకే రుణాలు ఇస్తున్న నేపథ్యంలో సహకార బ్యాంకులు సామాన్య ప్రజలకు చేయూత ఇవ్వాలని విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ పూర్వ చైర్మన్ మానం ఆంజనేయులు అన్నారు. బ్యాంకు ఆధ్వర్యంలో పోర్టు కళావాణి ఆడిటోరియంలో శనివారం ఆయనకు అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార బ్యాంకులు ప్రజాస్వామ్యయుతంగా జవాబుదారీతనంతో పని చేయాలని పిలుపునిచ్చారు. సహకారం బ్యాంకులను పాలకవర్గాలు, ఉద్యోగులు, సభ్యులే కాపాడుకోవాలన్నారు. ప్రభుత్వ సహకారం అందని పరిస్థితుల్లో ప్రజలు పరస్పరం సహకరించుకునేందుకు ఏర్పాటు చేసుకున్నవే సహకార సంస్థలని చెప్పారు. ప్రభుత్వ సహకారం తీసుకున్న రోజున సహకార వ్యవస్థ పతనం ప్రారంభమైనట్టేనని అన్నారు. మధ్యతరగతి ప్రజల ఆదాయాలు తగ్గి ఆర్థికంగా క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో బ్యాంకుల్లో పొదుపు మొత్తాలు తగ్గుతున్నాయని తెలిపారు. తమ బ్యాంకు 54 శాఖలతో రూ.7,675 కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహించే స్థాయికి ఎదగడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆంజనేయులును సహకార రంగ ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, కార్మిక, కర్షక సంఘాల ప్రతినిధులు, వీసీబీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, కాకినాడ కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర, ప్రముఖ పారిశ్రామికవేత్త ప్రభాకరరావు, మహారాజా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు వ్యవస్థాపక చైర్మన్ ఎంఆర్‌కే రాజు, ది గుత్తి కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు చైర్మన్, ఏపీ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ జిలాని, కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీపై విచారణ షురూ

... 5వ పేజీ తరువాయి

నిర్ణయాలు తీసుకున్నారు. పాడి రైతులను సభ్యులుగా చేసుకుని ఏర్పాటైన సొసైటీని కంపెనీగా మార్చేశారు. అందులో తన కుటుంబ సభ్యులను డైరెక్టర్లుగా పెట్టుకున్నారు. విశాఖ డెయిరీ పేరుతో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎక్కడికక్కడ భూములు కొన్నారు. వాటి విలువ ఇప్పుడు వందల కోట్ల రూపాయలకు చేరింది. వాటిలో అనేకం చేతులు మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతుల కోసమని నిర్మించిన 'కృషి' ఆస్పత్రిని కార్పొరేట్ సంస్థకు అప్పగించేశారు. మూడేళ్లుగా రైతులకు బోనస్ ఇవ్వడం మానేశారు. ఆ స్థానంలో సర్వసభ్య సమావేశాల్లో కానుకలు ఇస్తున్నారు. పాల ధరలు పెరుగుతుంటే..రైతులకు ఇచ్చే సేకరణ ధరను ఇటీవల తగ్గించేశారు. అదేమిటని ప్రశ్నిస్తే నష్టాలు వస్తున్నాయని సమాధానం చెబుతున్నారు. ఇంత భారీ వ్యాపారం చేస్తుంటే నష్టాలు ఎలా వస్తున్నాయనేది అనుమానం.

- హైదరాబాద్‌లో ఆడారి కుటుంబం సొంతంగా ఒక డెయిరీని పెట్టుకొని దానికి ఇక్కడి నుంచి రోజూ 15 వేల లీటర్ల పాలను సరఫరా చేస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. డెయిరీలో కీలక స్థానాల్లో ఉన్నవారు ఇలాంటి ప్రైవేటు వ్యాపారాలు చేయకూడదంటున్నారు.
- పరవాడ సమీపాన దేవదాయ శాఖ భూమిని డెయిరీ పేరుతో లీజుకు తీసుకొని కుటుంబ సభ్యులతో ఐస్‌క్రీమ్ పార్లర్ పెట్టించారనే మరో అభియోగం.
- డెయిరీ సభ్యులకు ఆడపిల్ల పుడితే లక్ష రూపాయలు, మగబిడ్డ పుడితే రూ.50 వేలు డిపాజిట్ చేయాలని నిర్ణయం ఉంది. దీనికి రూ.25 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. రైతుల పేరుతో వాటిని డెయిరీ పెద్దలు వాడేసుకున్నారనేది ప్రధాన ఆరోపణ.
- నర్సీపట్నం, చినగదిలి, తదితర ప్రాంతాల్లో డెయిరీ పేరుతో 34 ఎకరాల భూములు ఉన్నాయి. అవి సొసైటీ నిధులతో కొనుగోలు చేసినవి. వాటి లెక్కలు సరి చూడాల్సి ఉంది.
- నరవలో డెయిరీ పేరుతో మూడు ఎకరాల భూమి కొనుగోలు చేసి అందులో 90 సెంట్లు కుటుంబ సభ్యుల పేరు మీదకు మార్చేశారని ఆరోపణలు ఉన్నాయి.
- విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం గర్భాంలో 50 ఎకరాలు డెయిరీ పేరున ఉన్నాయి. వాటి సంగతి తేల్చాల్సి ఉంది.

ప్రకృతి ఆధారిత పంటల ఆహారం ఆరోగ్యకరం

» విశాఖ ఆర్గానిక్ మేళాను విజయవంతం చేయండి: జలగం కుమారస్వామి



వివరాలు వెల్లడిస్తున్న కిసాన్ సంఘ్ కార్యవర్గ సభ్యులు

సీతమ్మధార, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో డిసెంబరు 5 నుంచి 8 వరకు ప్రకృతి ఆధారిత పంటల మేళా నిర్వహిస్తున్నామని, విశాఖ ఆర్గానిక్ మేళాను విజయవంతం చేయాలని భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమారస్వామి పిలుపునిచ్చారు. సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీ నక్కవానిపాలెంలోని స్కూల్‌లో కేశవ్ సేనా సమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి ఆధారిత పంటలను ఆహారంగా తీసుకోవడం ఆరోగ్యకరమన్నారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగించి పండించే పంటలు అనారోగ్యం కలిగిస్తాయని, పర్యావరణానికి నష్టం కలుగుతుందని వివరించారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ మాట్లాడుతూ 5న ఉదయం 10 గంటలకు రైతుల సమ్మేళనం, 6న మీ ఆరోగ్యం మీ చేతిలో, 7న ఫుడ్ ప్రాసెసింగ్, 8న మిద్దె తోటలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలెం నేచురల్స్ ప్రతినిధిగా అశోక్, సత్వా నేచురల్స్ ప్రతినిధిగా మధుసూదన్ రెడ్డి, అవని ఆర్గానిక్స్ ఉషా గణపతి రాజు, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌టీఓ, వ్యవస్థాపక కార్యదర్శి జె.వి. రత్నం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నిధులతో మందిరానికి ముఖద్వారం

మాధవధార, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి); విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 51వవార్డు గాంధీనగర్ హరిహర క్షేత్రం శివాలయానికి చేరే దారిలో ఉడాకాలనీ రోడ్డు నుంచి మందిరానికి కొత్త ముఖద్వారం నిర్మిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు తన సొంత నిధులతో ఈ ముఖద్వారం నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఇటీవల స్వర్గస్తులైన తన భార్య వెంకట రమణికుమారి జ్ఞాపకార్థం ఈ ముఖద్వార నిర్మాణం చేపడుతున్నారు. ప్రధాన ముఖద్వారంపై పార్వతీ పరమేశ్వరుల రూపాలు సహా వినాయక ప్రతిమలు, ఎమ్మెల్సీ సతీమణి పేరు, ఎమ్మెల్సీ పేర్లు ఉండేలా ముఖద్వారం డిజైన్ చేశారు. కాలనీ వాసులకు, ఆలయ నిర్వాహకులకు గుడి అభివృద్ధికి కలిసి వచ్చేలా ఈ నిర్మాణాన్ని చేపడుతున్నారు. జనవరి నెలాఖరుకు పనులు పూర్తి చేసి ఆరంభించాలని నిర్దేశించుకున్న మేర పనులు వేగవంతంగా చేపడుతున్నారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు విరాళంతో చేపడుతున్న పనులను ఆలయ కమిటీ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. అనుకున్న సమయానికి పూర్తి చేసేలా వనరులు సమకూరుస్తున్నారు.

మరుగుదొడ్డి ఏర్పాటు చేస్తే ఫిర్యాదు చేస్తారా?

» కనకమహాలక్ష్మి దేవస్థానం ఈవోకు మద్దతుగా నిలిచిన స్థానికులు



రురుగుదొడ్డి ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని స్థానికులతో కలిసి పరిశీలిస్తున్న దేవస్థానం ఈవో కె.శోభారాణి

జగదాంబ కూడలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి దేవస్థానం మార్గశిర మాసోత్సవాల ఏర్పాట్లలో భాగంగా భక్తుల క్యూలైన్లకు దగ్గరగా ఉండే ప్రాంతంలో ఈవో కె.శోభారాణి చెత్తను తొలగించి మరుగుదొడ్డి సౌకర్యం కల్పించారు. ఈ చర్య గిట్టని వైసీపీకి చెందిన కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ కార్యాలయం నుంచి వివరణ కోరడంతో ఈవో మనస్తాపం చెందారు. వాస్తవ పరిస్థితిని తెలియజేస్తూ కలెక్టర్ కార్యాలయానికి ఆమె ప్రత్యుత్తరం పంపారు. గతంలో వైసీపీతో అంటకాగిన కొందరు మార్గశిర మాసోత్సవాల ఏర్పాట్లపై వివాదం సృషించే చర్యలకు దిగారంటూ దేవస్థానంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. విక్టోరియా ఆసుపత్రి వైపు మార్గం సీతారాముల గుడి కాలువ వద్ద భక్తుల కోసం నిర్మించిన మరుగుదొడ్లపై కలెకర్ కు తప్పుడు ఫిర్యాదులు చేయించ డం దేవస్థానం అధికారులను కలచివేసింది. ఈ విషయంపై ఈవో కె,శోభారాణి స్థానిక వ్యాపారులు, అమ్మవారి భక్తులతో మాట్లాడి అభిప్రాయ సేకరణ జరిపారు. ఈ విషయంలో వారంతా ఈవోకు మద్దతుగా నిలిచారు. భక్తుల సౌలభ్యం కోసం సీతారాముల గుడి కాలువ వద్ద చెత్త నిల్వ చేసిన ఇనుప తొట్టెలను తొలగించి మరుగుదొడ్డి నిర్మించామన్నారు. దీనిపై కలెక్టర్‌కు తప్పుడు ఫిర్యాదులు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. వాస్తవ పరిస్థితి తెలుసుకున్న కలెక్టర్ నుంచి సానుకూల స్పందన రావడంతో దేవాదాయశాఖ అధికారులు పనుల్లో వేగం పెంచారు. ఉత్సవ ఏర్పాట్లకు ఆటంకం లేకుండా చేసుకోవచ్చని దేవస్థానం ఉద్యోవర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

వార్డుల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

» గాజువాక గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నుంచి దుర్వాసన రాకుండా చూడాలి

» అధికారులకు ఆదేశించిన జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్


గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న పల్లా శ్రీనివాసరావు, కమిషనర్ సంపత్‌కుమార్, తదితరులు

గాజువాక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గాజువాక జోనల్ పరిధిలోని పలు వార్డుల్లో సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులకు, గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయవలసిందిగా అధికారులకు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. జోనల్ పరిధిలోని పలు వార్డుల్లో శనివారం ఆయన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి పర్యటించారు. గాజువాక గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ సమీప ప్రాంతాల్లో నివాసాలు అధికంగా ఉండడం వల్ల ప్రజలకు హాని కలగకుండా చేయాలని, స్టేషన్ చుట్టూ రక్షణ గోడను నిర్మించాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, దుర్వాసన రాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే 73వ వార్డులో క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలని, పలు వార్డుల్లో వీధి లైట్లు వెలిగేలా చూడాలని, క్రీడల అభివృద్ధికి సమకారాన్ని అందించాలని పేర్కొన్నారు. అదేవిధంగా 87వ వార్డులోని కళింగ వీధిలో గల నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుని స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ పల్లా శ్రీనివాసరావు సూచించిన పనులకు ప్రతిపాదలను సిద్ధం చేయాలని గ్రేటర్ చీఫ్ ఇంజనీర్ పి.శివప్రసాద్‌రాజు, సిటీ ప్లానర్ మీనాకుమారి, గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రిలను ఆదేశించారు.

కార్యక్రమంలో కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, రౌతు శ్రీనివాసరావు, బొండా జగన్, పర్యవేక్షక ఇంజనీర్ గోవిందరావు, డీడీహెచ్ ఎం.దామోదరరావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు చిరంజీవి, అప్పారావు, కనకారావు, ఏసీపీ వెంకటరావు, ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక ఎలక్ట్రానిక్స్ అంశంపై విద్యార్థులకు అవగాహన

అగనంపూడి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఆధునిక ఎలక్ట్రానిక్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లీడ్ డిజైన్ ఇంజనీర్ ఎం.శ్రీలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు తగ్గట్టుగా విద్యార్థులు రాణించాల్సిన అవసరం ఉందన్నారు. ఎలక్ట్రానిక్ రంగంలో కీలకమైన మైక్రోచిప్‌ల రూపకల్పన, వాటి అభివృద్ధికి అవసరమైన సాంకేతికల గురించి అనంతరం శ్రీలక్ష్మిని విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ మధుసూదనరావు, హెచ్‌వోడీ ఉమామహేశ్వరరావు, కో-ఆర్డినేటర్ గణేశ్ పాల్గొన్నారు.

సమస్యలపై కమిషనర్‌కు వినతి

అగనంపూడి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధిలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ శనివారం వినతి పత్రం అందజేశారు. గల్లవానిపాలెంలో గల చెరువు అభివృద్ధికి నిధులు కేటాయించేందుకు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈచెరువును అభివృద్ధి చేస్తే ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అలాగే కేఎస్ఎన్ రెడ్డినగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని, పలు గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలని కోరారు.

ఆలయంలో గణబాబు పూజలు

ఎన్.ఎ.డి.జంక్షన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు ఎన్.ఎ.డి. జంక్షన్‌లో కొలువైన విశ్వేశ్వర కుమారస్వామి ఆలయంలో ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు డి.రామమూర్తి శర్మ పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. పూజలు అనంతరం కమిటీ సభ్యులు గణబాబును సన్మానించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సినిమా గైడ్

● **మెకానిక్ రాఖీ:** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

● **దేవకీనందన వాసుదేవ:** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **జీబ్రా:** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)

● **కంగువా:** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)

● **లక్కీ భాస్కర్:** వెంకటేశ్వర

● **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 47, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 26, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 30, క్యారెట్ 56 దొండకాయలు 32, బంగాళ దుంపలు 34, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 28 దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 50, కీరదోస 28, కాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడ దుంపలు 32, కంద 58, దేముడు చిక్కుడు 80, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 55, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికమ్ (రంగు)... కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	590
విజయనగరం	594
శ్రీకాకుళం	594

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	100
ఫారం ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

తుఫాన్ ప్రభావంతో రైతన్న వెన్నులో వణుకు



పెందుర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెమింగ్ తుఫాన్ రైతుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. శనివారం విరామం లేకుండా వాన కురవడంతో మండలంలోని పలు ప్రాంతాల్లో కోతకు వచ్చిన వరిచేలు నేలకొరగడంతో పంట దక్కకుండా పోతుందన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. వరి కోతలు మొదలవుతున్న కీలక సమయంలో భారీ వర్షం కురవడంతో పంట నీటిపాలయ్యే అవకాశం ఉంది. అలాగే వరికుప్పలు తడిసిముద్దవడంతో పంట నష్టం తప్పేట్లు లేదన్న భావనతో రైతుల్లో నైరాశ్యం అలముకుంది. పినగాడి, గొరపల్లి, ముదపాక. నరవ, రాజయ్యపేట ప్రాంతాల్లో వరి ఒరిగింది. సుమారు 20 హెక్టార్లలో వరి పంటకు నష్టం జరిగే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. వర్షానికి రహదారులు చిత్తడిగా మారాయి. పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్ కాలనీలో అంతర్గత రోడ్లు బురద అయ్యాయి. వెంకటాద్రి శిఖరం ఆహ్లాదకరంగా మారింది.

వరి వెన్నుకు ఇబ్బంది

-వెన్నెల పెంటబాబు



తుఫాన్ ప్రభావం వల్ల బలంగా వీచిన గాలులతో వరి వెన్ను నేలకొరిగింది. ఎడతెరిపి లేని వానకు వ్యవసాయ పంట మడుల్లో వర్షపు నీరు వచ్చి చేరడంతో ఒరిగిన వెన్ను తడిసి భారంగా మారింది. వరి కోతల సమయంలో వెన్ను నేలకొరగడంతో రైతులకు దిగుబడి తగ్గి పంట నష్టపోయే అవకాశముంది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

వెంకటాద్రిపై కన్నుల పండువగా దీపోత్సవం | శ్రీవారి దర్శనానికి తరలివచ్చిన భక్తజనం

పెందుర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటాద్రి శిఖరంపై కొలువై ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం కార్తీకమాసం ముగింపు సందర్భంగా నిర్వహించిన అఖండ దీపోత్సవం కనులపండుగా జరిగింది. పలువురు మహిళలు, భక్తులు పాల్గొని వెంకటాద్రి ఆలయ మెట్ల మార్గంలో దీపాలతో అలంకరించారు. శిఖరం పైభాగంలో గల గోవిందనామాలు వరకు దీపాలు ఏర్పాటు చేశారు. గోపురంపై ఆకాశ దీపం వెలిగించారు. ఈ సందర్భంగా వెంకన్న విగ్రహానికి ఆసాంతం దీపాలతో అలంకరించారు. దీపకాంతులతో తేజోమూర్తిగా శోభిల్లుతూ శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. శంఖు, చక్ర, గోవింద నామాల ఆకృతితో దీపాల అమరిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వెంకటాద్రిపై జ్యోతి కాంతులతో శిఖరమంతటా వెలుగులు విరజిమ్మాయి. అనంతరం వెంకటేశ్వరస్వామి మూలవిరాట్టు విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అఖండ హారతులిచ్చి వజ్రధారి అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.


వెంకటాద్రిపై కొలువుదీరిన శ్రీవారికి పూజలు చేస్తున్న అర్చకుడు


స్టీల్‌ప్లాంట్ శ్రీవారి ఆలయంలో దీపాలంకరణ

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంటులో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక అమావాస్య పూజలను వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారిని శోభాయమానంగా అలంకరించి పూలంగి సేవ, నక్షత్ర పూజలు చేసి కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటలకు సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు విచ్చేసి శ్రీవారిని దర్శించుకున్నారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబే కాలనీ కొండపై వెలసిన శ్రీనివాసునికి తులసీదళార్చన చేశారు. వేకువజామున సుప్రభాత సేవ జరిపాక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అన్న సమారాధన చేపట్టారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 88వ వార్డు గ్రీన్ సిటీలో శ్రీవారికి కార్తీక మాసం ఆఖరు శనివారం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వైజాగ్ ప్రొఫైల్స్ డైరక్టర్లు బండి సురేశ్‌కుమార్, వీవీ కృష్ణారావులతో పాటు పద్మజ, రాజ్యలక్ష్మి, శివప్రసాద్, సునీల్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయంతో ఇబ్బందులు

గోపాలపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారిలో ఓ వ్యాపార సముదాయానికి జరుగుతన్న ఆధునికీకరణ పనుల్లో భాగంగా నిర్మాణ సామగ్రి విద్యుత్ తీగలపై పడడంతో శుక్రవారం సాయంత్రం నుంచి గోపాలపట్నంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ కారణంగా విద్యుత్ సరఫరాలో సంభవించిన హెచ్చుతగ్గుల కారణంగా ప్రధాన రహదారిలోని పలు ఇళ్లల్లోని గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. శనివారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా అడపాదడపా అంతరాయం కలగడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

జగ్గయ్యపాలెంలో పశు వైద్య శిబిరం

గోపాలపట్నం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 88వ వార్డు గవర జగ్గయ్యపాలెంలో శనివారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక పశువైద్య శాఖ వైద్యాధికారి డాక్టర్ సుజాత పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో పశువులకు గర్భకోశ వ్యాధి, దూడలకు నట్టల నివారణకు మందుల పంపిణీ చేశారు. అలాగే 42 పశువులకు వివిధ రకాల వ్యాధులకు సంబంధించి చికిత్సలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సౌజన్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు ఉత్పత్తి పెంపునకు కృషి చేయాలి: సీజీఎం


సీజీఎం శ్రీధర్‌ను సత్కరించిన ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో ఉత్పత్తిని మరింత పెంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీజీఎం (వర్క్స్) యు.శ్రీధర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం సీజీఎం చేసిన సేవలకు గాను శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తులో మరింత ప్రగతి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్సీ లైజన్ అధికారి నల్ల సుందరం మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరు ఉందని, అందరి సహకారంతో ప్లాంటును మరింత ముందుకు తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బయ్యే మల్లయ్య, ఎస్.సత్యనారాయణ, ఎల్‌వీ రమణారావు, మోహన్‌బాబు, సాయి ప్రసాద్, పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

పోలిపాడ్యమికి సిద్ధమైన కృష్ణ మహంతి చెరువు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా సోమవారం నిర్వహించే పోలిపాడ్యమి దీపారాధనకు నాతయ్యపాలెంలోని కృష్ణమహంతి చెరువుతో పాటు తుంగ్లాం, అక్కిరెడ్డిపాలెం చెరువులను సిద్ధమయ్యాయి. నాతయ్యపాలెం కృష్ణ మహంతి చెరువు చుట్టూ ఇప్పటికే మెట్లను ఏర్పాటు చేసిన కాలనీ నాయకులు శనివారం చెరువులోని వ్యర్థాలను ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు.

తుంగ్లాంలో అన్న సమారాధన

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆఖరి శనివారం సందర్భంగా తుంగ్లాంలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్న సమారాధనను కూటమి నాయకుడు కరణం ముత్యాలనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారునికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

జోరువానలోనూ పింఛన్ల పంపిణీ

మల్కాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో జోరుగా వర్షం కురుస్తున్నా పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. 59, 60 వార్డులలో ఉదయం ఆరు గంటల నుంచే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి డబ్బు అందజేశారు. ఒక్కరోజు ముందుగా పింఛన్ ఇవ్వడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలను సంతోషపెట్టడమే ధ్యేయంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 60వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మాతా శ్రీను, జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, 59వ వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి మితిరెడ్డి శంకర్ , రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రామ్మోహన్‌నాయుడు పాల్గొన్నారు. అలాగే 59వ వార్డు బీజేపీ ఆధ్వర్యంలో ములగాడ హౌసింగ్‌కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. బీజేపీ పశ్చిమ నియోజకవర్గం సదస్య అభియాన్ ఉప ప్రముఖ్ లక్కరాజు రామకృష్ణ పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభ పోస్టర్లు ఆవిష్కరణ

గాజువాక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి ఐదున జరగనున్న హైందవ శంఖారావం బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను చినగంట్యాడ అయోధ్య సమావేశ మందిరంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ సభ్యుడు వీర్రాజు మాట్లాడుతూ హిందూ దేవాలయాల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. హిందూ ఆలయాలపై వచ్చే ఆదాయాన్ని వాటి అభివృద్ధి కోసం మాత్రమే వెచ్చించాలన్నారు. బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ హైందవ బహిరంగ సభకు గాజువాక నుంచి ప్రజలంతా తమ కుటుంబ సభ్యులతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు సిరసపల్లి నూకరాజు, కృష్ణ, జగదీశ్, మహేశ్, శేఖర్, సత్యనారాయణ, జైస్వాల్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని మతాల సారం ఒక్కటే..

వేపగుంట నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎవరు ఏ మతాన్ని నమ్ముకున్నా, అన్ని మతాల సారం ఒక్కటేనని మనుజ్యోతి ఆశ్రమ నిర్వాహకులు లియో పాల్‌సీ లారీ పేర్కొన్నారు. నాయుడుతోట లక్ష్మీ కల్యాణ మండపంలో ఒకే దేవుడు-ఒకే దేశం అనే సిద్ధాంతాన్ని అందరికీ తెలియజేసేందుకు మనుజ్యోతి ఆశ్రమ ఆధ్వర్యంలో కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు నిర్వహించే ఆధ్యాత్మిక యాత్ర కార్యక్రమం ఇక్కడ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న లియో పాల్‌సీ లారీ మాట్లాడుతూ ప్రతి మత గ్రంథం చదివితే భేద భావాలు తొలగి సామరస్యంగా ఉండగలమన్నారు. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని చెప్పేందుకు ఈ యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో చింతపల్లి, పాడేరు, నర్సీపట్నం, చింతపల్లి, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, రాయగడ ప్రాంతాల మనుజ్యోతి ఆశ్రమ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆరు నెలల కాలపరిమితితో పాస్‌లు ఇవ్వాలి

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న పర్మినెంట్ కాంట్రాక్టు కార్మికులకు ఆరు నెలల వ్యవధితో కూడి గేటు పాసులు ఇవ్వాలని కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు యాజమాన్యాన్ని కోరారు.


సింధియా ప్రధాన రహదారిలో గుంపుగా సంచరిస్తున్న గేదెలు

రోడ్లపై విచ్చిలవిడిగా పశువుల సంచారం

» తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు

» అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వేడుకోలు

సింధియా, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతం ప్రధాన రహదారులపై విచ్చలవిడిగా పశువులు సంచరిస్తుండడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గుంపులు గుంపులుగా గేదెలు, ఆవులు రహదారుల మధ్యలో ఉంటుండడంతో ఒక్కోసారి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోజూ ఇష్టానుసారంగా పశువుల పెంపకందారులు వీటిని రోడ్లపై విడిచిపెడుతున్నా జీవీఎంసీ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా సింధియా న్యూ కాలనీ రోడ్డు, మార్కెట్ పరిసర ప్రాంతాల్లో పశువుల సంచారం అధికంగా ఉంటుండడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. రాత్రిపూట అయితే రోడ్లపైనే పశువులు నిద్రిస్తూ ఇబ్బందికరంగా ఉంటున్నాయని, వీటివల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల జీవీఎంసీ అధికారులు స్పందించి రహదారులపై పశువులను పెంపకందారులు విడిచిపెట్టకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.


గాడాంధకారంలో మల్కాపురం ప్రధాన రహదారి

పారిశ్రామిక ప్రాంతాన్ని వీడని చీకట్లు

మల్కాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతం ప్రధాన రహదారిలో చీకట్లు అలముకున్నాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) జంక్షన్ నుంచి మల్కాపురం మెయిన్ రోడ్డు వరకు నెలరోజులుగా ఇదే పరిస్థితి ఎదురవుతోంది. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. దీనికి తోడు హెచ్‌పీసీఎల్‌కు వచ్చే భారీ వాహనాలను ఈ చీకటి రోడ్డుపైనే నిలిపివేస్తున్నారు. దీంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ వీధి దీపాలను వెంటనే వెలిగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వీధి దీపాలు వెలగడం లేదని జీవీఎంసీ విద్యుత్ శాఖా సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, దీంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదంటున్నారు.

మౌలిక వసతులపై ఎమ్మెల్యే పంచకర్ల ఆరా


లబ్ధిదారునికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, తదితరులు

పెందుర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శనివారం 97వ వార్డు పరిధిలోని పలు గ్రామాల్లో కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావు. జెడ్సీ హేమావతి, అధికారులతో కలసి గిరిప్రసాద్‌నగర్, కార్మికనగర్, ప్రశాంతినగర్, ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీల్లో పర్యటించారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు . అనంతరం కాలనీవాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ముదునూరి రాజాసుధాకర్, సేనాపతి సోమశేఖర్, పిళ్లా జగన్మోహనపాత్రుడు, కిశోర్ చౌదరి పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణకు చైతన్యమే చికిత్స

మల్కాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌ను నివారించడానికి ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ఒక్కటే సరైన మందు అని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో ఎయిడ్స్ వ్యాధిపై శనివారం నిర్వహించిన క్విజ్ పోటీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ లైసెన్స్ పొందిన బ్లడ్ బ్యాంక్ నుంచి మాత్రమే రక్తాన్ని స్వీకరించాలని, డిస్పోజబుల్ సిరంజీలను, సూదులను మాత్రమే వాడాలని, ప్రతి ప్రసవం ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో జరిగేలా చూడాలని, వివాహేతర సంబంధాలు ఉండకూడదని అన్నారు. అనంతరం బీబీఏ, బీసీఏ విద్యార్థినులకు, వాలంటీర్లకు క్విజ్ పోటీ నిర్వహించారు. పోటీల నిర్వహణలో జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయదేవీ, వి.అంజలిదేవీ, నదియా, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

గీతాకృష్ణ ఆలయంలో మహా రుద్రాభిషేకం

పెందుర్తిరూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పెందుర్తి మండలం చింతల అగ్రహారం గవరపాలెం కాలనీలో గల శ్రీ గీతాకృష్ణ మందిరంలోని హరి సన్నిధిలో శనివారం హరుని మహన్యాస పూర్వక మహా రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావు ఆధ్వర్యంలో అర్చక స్వాములు హరిహర నామస్మరణల మధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం ఆలయ కమిటీ అన్న ప్రసాద వితరణ చేసింది.

పుస్తెలతాడు దొంగ అరెస్టు

పెదగంట్యాడ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వికాస్‌నగర్‌లోని తమ ఇంటిలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడును బలవంతంగా తెంచుకుపోయిన దొంగను న్యూపోర్టు క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. హార్బర్ సబ్ డివిజన్ ఏడీసీపీ-2 మోహనరావు శనివారం న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వికాస్‌నగర్ ఎంఐటీ క్వార్టర్‌లో చెట్టి రమాబాయి(70) ఒంటిరిగా ఉంటుంది. నవంబరు 23న చినగంట్యాడ శ్రామికనగర్ కాలనీకి చెందిన పబ్బిన కోటరావు అలియాస్ కోటి (24) ఆమె ఇంట్లోకి ప్రవేశించి మెడలో ఉన్న రెండుతులాల బంగారు పుస్తెలతాడును బలవంతంగా లాక్కొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు న్యూపోర్టు క్రైం పోలీసులు శనివారం పట్టుకున్నారు. అలాగే గోల్డ్ లోన్ పెట్టిన చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని నిందితున్ని రిమాండ్‌కు తరలించారు. కేసును చేధించడంలో నైపుణ్యాన్ని ప్రదర్శించిన సీఐ జి.శ్రీనివాసరావు, ఎస్ఐలు అప్పలరాజు, రామమూర్తి, ఎంవీ రమణలను ఏడీసీపీ అభినందించారు.

పదో రోజుకు విశాఖ డెయిరీ కార్మికుల దీక్షలు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ విశాఖ డెయిరీ కార్మికులు గత పది రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడం సిగ్గుచేటని డెయిరీ కో-ఆపరేటివ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కేవీ వరహామూర్తి అన్నారు. కనీస వేతనాలతో పాటు వేతన సవరణ వంటి సమస్యల పరిష్కారం కోరుతూ డెయిరీ మెయిన్ గేటు ఎదుట కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి పదో రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వి.నారాయణ, చిన్నమ్మలు, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

కాగా సమస్యల పరిష్కారం కోరుతూ డిసెంబరు ఐదు తర్వాత సమ్మె చేస్తామని యూనియన్ నాయకులు విశాఖ డెయిరీ యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇవ్వడంతో శనివారం లేబర్ కమిషనర్ యాజమన్యాన్ని, యూనియన్‌లకు చర్చలకు ఆహ్వానించారు. అయితే చర్చలకు యూనియన్ నాయకులు హాజరైనప్పటికీ డెయిరీ యాజమాన్యం హాజరు కాలేదని కార్మిక నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఐదో తేదీ తర్వాత సమ్మెకు దిగడం తథ్యమని కార్మిక నాయకులు స్పష్టం చేశారు.

నెమ్మదిస్తోన్న మహమ్మారి

అవగాహనతోనే ఎయిడ్స్‌కు అడ్డుకట్ట



విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): **జిల్లాలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ మహమ్మారి నెమ్మదిస్తోంది. గడిచిన ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది కొత్తగా వ్యాధి బారినపడిన వారి సంఖ్య తగ్గుముఖం పట్టింది. గడిచిన ఏడాది జిల్లాలో 1.05 శాతం మంది హెచ్‌ఐవీ/ఎయిడ్స్ బారిన పడ్డారు. ఈ ఏడాది 0.78 శాతానికి తగ్గింది. అయితే, ఇప్పటికీ వ్యాధి బారినపడుతున్న వారిలో యువత దాదాపు 95 శాతం ఉండడం ఆందోళన కలిగిస్తోంది. నేడు (ఆదివారం) అంతర్జాతీయ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకుని అందిస్తున్న ప్రత్యేక కథనం...**

- గడిచిన ఏడాదితో పోలిస్తే తగ్గిన కేసుల సంఖ్య
- ఇప్పటికీ వ్యాధి బారినపడుతున్న వారిలో 95 శాతం మంది 40 ఏళ్ల లోపువారే...
- అసురక్షిత లైంగిక చర్యలు వల్లే వ్యాధి భారినపడుతున్నట్టు చెబుతున్న అధికారులు
- నేడు అంతర్జాతీయ ఎయిడ్స్ దినం

ప్రజల్లో అవగాహన కలిగించే ఉద్దేశంతో ఏటా డిసెంబరు ఒకటో తేదీన ఎయిడ్స్ డే నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 'హక్కుల మార్గాన్ని అనుసరించండి-నా ఆరోగ్యం, నా హక్కు' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. కొత్తగా ఎవరినీ హెచ్‌ఐవీ బారినపడకుండా చేయడం, ఇప్పటికే హెచ్‌ఐవీ సోకిన వారిని వివక్ష లేకుండా సామూహికంగా కలుపుకుని పోవడంపై ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అవగాహన కలిగించనున్నారు. తొలిసారి ప్రపంచ ఎయిడ్స్ డేను 1988లో నిర్వహించారు. ప్రస్తుతం 189 దేశాలు ఈరోజు నిర్వహిస్తున్నాయి.



తగ్గుముఖం

గడిచిన మూడేళ్లలో జిల్లాలో హెచ్‌ఐవీ/ ఎయిడ్స్ కేసుల సంఖ్య కొంతవరకూ తగ్గుముఖం పట్టినట్టుగానే చెప్పాలి. ఇది కొంత సానుకూలాంశం. అయితే, ఇప్పటికీ హెచ్‌ఐవీ/ఎయిడ్స్ బారిన పడుతున్న వారిలో దాదాపు 95 శాతం మంది 40 ఏళ్లలోపు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. 2022-23లో జిల్లాలో 1,04,823 మందికి పరీక్షలు నిర్వహించగా 927 మంది (0.88 శాతం)కి వ్యాధి నిర్ధారణ అయింది. 2023-24లో 78,556 మందికి పరీక్షలు నిర్వహించగా 827 మందికి (1.05 శాతం) పాజిటివ్ తేలింది.

2024-25 ఏడాది (ఏప్రిల్ నుంచి అక్టోబరు) వరకు 55,496 మందికి పరీక్షలు నిర్వహించగా 433 మందికి (0.78 శాతం) పాజిటివ్ వచ్చింది. ఇందులో 21,133 మంది గర్భిణుల పరీక్షలు నిర్వహించగా 12 మందికి (0.06 శాతం) పాజిటివ్‌గా తేలింది.

ఈ నాలుగింటి ద్వారా...

అసురక్షిత లైంగిక సంపర్కం, కలుషితమైన సిరంజీ, సూది ద్వారా, తల్లి నుంచి (గర్భం దాల్చిన మహిళ జాగ్రత్తలు పాటించడం ద్వారా రాకుండా చేయవచ్చు) బిడ్డకు, రక్తమార్పిడి ద్వారా హెచ్‌ఐవీ/ఎయిడ్స్ వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఈ నాలుగు అంశాల్లో జాగ్రత్తలు పాటించడం ద్వారా ఎయిడ్స్ వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చు. కరచాలనం, కౌగిలించుకోవడం, కలిసి భోజనం చేయడం, ఒకే మరుగుదొడ్డి వాడడం, దోమ కుట్టడం, కలిసి ప్రయాణం చేయడం వల్ల ఒకరి నుంచి వేరొకరికి ఎయిడ్స్ వస్తుందన్నది అపోహ మాత్రమే.

అసురక్షిత లైంగిక సంబంధాలతోనే..

గతంలో సెక్స్ వర్కర్లు, లారీ డ్రైవర్లు, ట్రాన్స్‌జెండర్స్ వంటి వారిలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ పాజిటివ్ కేసులు కనిపించేవి. అయితే, ఇప్పుడు వారంతా సురక్షితమైన లైంగిక పద్ధతులను అనుసరిస్తుండడంతో ఆ కేటగిరీల్లో పాజిటివ్ కేసులు పూర్తిగా తగ్గాయి. ప్రస్తుతం ఎయిడ్స్ బారినపడుతున్న వారిలో ఎక్కువ మంది యువత ఉంటున్నారు. వీరంతా అసురక్షిత లైంగిక సంబంధాలను కొనసాగించడం వల్లే మహమ్మారి బారినపడుతున్నట్టు నిర్ధారణ అవుతోంది. అనారోగ్యం కారణంగా రక్త పరీక్షలు చేయించుకున్నప్పుడు దాదాపు 80 శాతం మందికి ఈ వ్యాధి ఉన్నట్టు తేలుతోంది. వీరిలో దాదాపు 90 శాతం మంది తామెక్కడా తప్పు చేయలేదని, తెలిసిన వారితో రిలేషన్ ఉందని చెబుతున్నారు. అంటే, తెలిసిన వాళ్లే కదా అని అసురక్షిత పద్ధతుల్లో లైంగిక చర్యలకు పాల్పడినా ఎయిడ్స్ వచ్చే ప్రమాదం ఉంది.

అవగాహనతోనే మహమ్మారికి అడ్డుకట్ట

– డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ నియంత్రణ అధికారి



అవగాహన ద్వారానే హెచ్‌ఐవీ/ఎయిడ్స్ మహమ్మారికి అడ్డుకట్ట వేయడం సాధ్యపడుతుంది. అసురక్షిత లైంగిక పద్ధతుల వల్లే ఎయిడ్స్ వ్యాప్తి చెందుతోంది. కాబట్టి ఈ విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. ఎయిడ్స్ బారినపడినవారు క్రమం తప్పకుండా మందులు వినియోగించడం వల్ల వైరల్ లోడ్ తగ్గుతుంది. మందులను ఎవరూ మధ్యలో ఆపకుండా జాగ్రత్త వహించాలి. వ్యాధి సోకినప్పటికీ భయాందోళన వద్దు. పూర్తిగా మందులు వినియోగించడం వల్ల సాధారణ జీవితాన్ని కొనసాగించవచ్చు. యువత తప్పుడు మార్గాల వైపు వెళ్లకుండా ఉండడం ద్వారా ఇటువంటి సమస్యలు బారిన పడకుండా ఉండేందుకు అవకాశం ఉంది.

ఇదీ లెక్క...

జిల్లాలో ప్రస్తుతం 10,993 మంది హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌తో బాధపడుతున్నారు. వీరిలో 5,094 మంది పురుషులు, 5,477 మంది మహిళలు, 62 మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు. వీరిలో పదిహేనేళ్లలోపు బాలురు 219 మంది, బాలికలు 151 మంది ఉన్నారు. జిల్లాలోని పది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 78 పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ స్ర్కీనింగ్ నిర్వహిస్తారు. సమగ్ర సలహా, పరీక్షా కేంద్రాలు పది ఉన్నాయి. ఇక్కడ నిష్ణాతులైన కౌన్సిలర్లు ఉంటారు. వీరు హెచ్‌ఐవీపై ఉన్న భయాందోళనలు తొలగించి పరీక్ష నిర్వహించి నిర్ధారిస్తారు. మొబైల్ వాహనం కూడా ఒకటి ఉంది. కేజీహెచ్, వీజీహెచ్‌లో సుఖ వ్యాధులు పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో ఒక ఏఆర్‌టీ ప్లస్ కేంద్రం కేజీహెచ్‌లో ఉంది. అక్కడ అడ్వాన్స్‌డ్ మందులు ఇస్తారు. వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులు అందించేందుకు కేజీహెచ్, గాయత్రీ, గీతం, ఎన్‌ఆర్‌ఐ, ఛాతీ అంటువ్యాధుల ఆస్పత్రుల్లో ఏఆర్‌టీ కేంద్రాలు ఉన్నాయి.

విక్టోరియాలో పకడ్బందీగా జననాల నమోదు



విక్టోరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషా ప్రసాద్

జగదాంబ కూడలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా జనన ధ్రువీకరణ పత్రాల జారీలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు విక్టోరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషా ప్రసాద్ వెల్లడించారు. శనివారం ఆసుపత్రిలో జరిగిన బాలల హక్కుల పరిరక్షణ సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. పుట్టిన పిల్లల వివరాల రికార్డుల నిర్వహణలో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఏడాదిగా ఆసుపత్రిలో జనన నివేదిక సక్రమంగా నమోదవుతున్నట్లు వెల్లడించారు. పుట్టిన పసికందుల్లో ఆడ, మగ వేర్వేరుగా రికార్డులో పొందుపరుస్తున్నామన్నారు. జనన నమోదులో తప్పులు దొర్లితే సరిచేసే ప్రక్రియను కూడా రూపొందించామన్నారు. ఆసుపత్రిలో గర్భిణి ప్రసవం కోసం చేరిన దగ్గర నుంచి డిశ్చార్జి అయ్యేవరకు ప్రతీ విషయం రికార్డుల్లో పొందుపర్చేలా శ్రద్ధవహిస్తున్నట్లు ఆమె వివరించారు. బాలల హక్కుల పరిరక్షణలో విక్టోరియా ఆసుపత్రి ముందుందని వెల్లడించారు. సమావేశంలో బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కమిటీ సభ్యుడు గొండు సీతారాం, విక్టోరియా ఆసుపత్రి వైద్యులు గీతా వందన, పి.శైలజ, పి.ఉషా, ఎస్.చంద్రశేఖర్, జీవన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర కారాగారం సూపరింటెండెంట్, అదనపు సూపరింటెండెంట్ల బదిలీ

- అదనపు సూపరింటెండెంట్‌గా మహేశ్‌బాబు





మహేశ్‌బాబు

ఆరిలోవ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు అధికారులు బదిలీ అయ్యారు. జైలు సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్‌ను అనంతపురం ఓపెన్ జైలు సూపరింటెండెంట్‌గా నియమిస్తూ జైళ్ల శాఖ ఆదేశాలు ఇచ్చింది. ఈయన ఇక్కడ సంవత్సన్నరగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఇక్కడే పని చేస్తున్న అదనపు సూపరింటెండెంట్ వెంకటేశ్వర్‌ను అనంతపురం జైలు అదనపు సూపరింటెండెంట్‌గా నియమించారు. ఈయన ఇక్కడ సుమారు 8 ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. తొలుత డీఎస్పీగా 2017 నుంచి 2021 వరకు, అనంతరం పదోన్నతిపై అదనపు సూపరింటెండెంట్‌గా 2021, డిసెంబరు నుంచి ఇప్పటి వరకూ పని చేస్తున్నారు. ఈయన స్థానంలో అనంతపురం అదనపు సూపరింటెండెంట్ మహేశ్‌బాబును నియమితులయ్యారు. కాగా, ప్రస్తుతానికి సూపరింటెండెంట్‌గా ఎవరినీ నియమించలేదు. బహుశా ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా మహేశ్‌బాబును అదనపు బాధ్యతలు కూడా చేపట్టవచ్చని జైలు వర్గాల ద్వారా తెలిసింది.

కన్నుల పండువగా పద్మనాభుని దీపోత్సవం

- భారీగా తరలివచ్చిన భక్తులు

పద్మనాభం (విశాఖపట్నం జిల్లా), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అనంత పద్మనాభుని దీపోత్సవ సంబరం అంబరాన్ని తాకింది. ఏటా కార్తీక బహుళ అమావాస్య రోజున నిర్వహించే ఈ ఉత్సవాన్ని శనివారం అత్యంత భక్తిప్రపత్తులతో నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు వేకువ జాము నుంచి పద్మనాభం చేరుకున్నారు. అనంతుని గిరి ప్రథమ పావంచా వద్ద పూజలు చేసి అనంతరం మెట్లకు పసుపు, కుంకుమ బొట్లు పెట్టుకుంటూ వెళ్లారు. సాయంత్రం వేళ రాలేమని భావించిన పలువురు ఉదయాన్నే మెట్లపై దీపాలను వెలిగించారు. కొండపై పద్మనాభుని ఆలయం పునర్నిర్మాణ దశలో ఉండడంతో దేవస్థానం ప్రత్యేకంగా రూపొందించిన వేదికపై ఉత్సవ విగ్రహాలను ఉదయం ఐదు గంటల నుంచే అందుబాటులో ఉంచి భక్తులకు దర్శనాన్ని కల్పించారు. సాయంత్రం నాలుగు సమయంలో కుంతీ మాధవస్వామి ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవ సమేత అనంత పద్మనాభుని ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై నిలిపి తప్పెటగుళ్లు, పులివేషాలు, కోలాటం బృందాల ప్రదర్శనల నడుమ, వేదపండితుల వేద మంత్రోచ్చారణలతో ఊరేగింపుగా ప్రథమ పావంచా వద్దకు తీసుకువచ్చారు. అక్కడ గరుడ వాహనంపై స్వామి వారిని నిలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వామివారికి పూజలు చేశారు. ప్రథమ పావంచాల వద్ద జేగంట కొట్టగానే భక్తులు అప్పటికే మెట్లపై సిద్ధం చేసుకున్న దీపాలను వెలిగించారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతం దేదీప్యమానంగా మారింది. ఉత్సవం సందర్భంగా పద్మనాభం సామాజిక వేదిక వద్ద రెవెన్యూ అధికారులు ఏర్పాటుచేసిన అల్పాహారం, మజ్జిగ పంపిణీ స్టాల్‌ను భీమిలి ఆర్డీఓ సంగీత్ మాధుర్ ప్రారంభించారు. పలువురు దాతలు కొండపైన, దిగువన భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు లా అండ్ ఆర్డర్ డీసీపీ అజిత ఆధ్వర్యంలో నార్త్‌జోన్ ఏసీపీ అప్పలరాజు, సీసీఎస్ ఏసీపీ లక్ష్మణరావు, ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవరావు ఆధ్వర్యంలో సుమారు 600 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.రాంబాబు, టీడీపీ సీనియర్ నాయకులు దామోదరరావు, నగేష్‌కుమార్, ఏపీ నాగవంశం కార్పొరేషన్ మాజీ చైర్మన్ అప్పలకొండమ్మ, అప్పలనాయుడు దంపతులు, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీ, సర్పంచ్ పాప, బీజేపీ ఏపీ వైద్య విభాగం కన్వీనర్ రవికుమార్, జనసేన భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్, బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు మహేష్, పాల్గొన్నారు.



ఉత్సవ విగ్రహాల వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



పద్మనాభుని దీపోత్సవంలో భక్తులు

2027 నాటికి రెట్టింపు జీడీపీ లక్ష్యం

- కలెక్టర్ హరేంధీర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధీర ప్రసాద్. వేదికపై వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, జేసీ మయూర్ అశోక్

ఎంవీపీ కాలనీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : 2027 నాటికి రెట్టింపు జీడీపీ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్టు జిల్లా కలెక్టర్ హరేంధీర ప్రసాద్ అన్నారు. ఎంవీపీ కాలనీ గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో రెండో రోజైన శనివారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ స్మార్ట్ సిటీ ఇనిషియేటివ్, సెక్టరల్ గ్రోత్ ప్లాన్‌లను వివరించారు. స్వర్ణాంధ్ర 2027లో భాగంగా విశాఖ జిల్లాలో ప్రాథమిక, మాధ్యమిక రంగాల్లో 15 శాతం వృద్ధి సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ఉద్యానవన పంటలు, కూరగాయలు, పండ్ల ఉత్పత్తిని పెంచడం, అదనంగా ఫుడ్ ప్రాసెసింగ్, చేపల ఎగుమతులు కీలక పాత్ర వహిస్తాయన్నారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ పబ్లిక్, ప్రైవేటు పార్టనర్‌షిప్ ప్రాజెక్టుల్లో పర్యాటకం, మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రణాళికలను వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ అధ్యక్షులు ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

జాయ్ జామీమా హనీ ట్రాప్ కేసులో ముఠా ప్రధాన సభ్యుడి అరెస్టు

మర్రిపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ధనికులు, వివాహమైన పురుషులను లక్ష్యంగా చేసుకుని ప్రేమాయణం, సహజీవనం, వివాహ నిశ్చితార్థం చేసుకొని అనంతరం వారిని బెదిరించి లక్షలాది రూపాయలు వసూలు చేసి కటకటాలపాలైన జాయ్ జామీమా అనే మహిళ ముఠాలోని ప్రధాన సభ్యుడైన వేణుభాస్కర్‌రెడ్డిని శనివారం ఎయిర్‌పోర్ట్ పోలీసులు అరెస్టు చేశారు. జాయ్ జమీమా చేసిన నేరాల్లో వేణుభాస్కర్‌రెడ్డి దాడులు, హత్యాయత్నాలలో ప్రధాన పాత్ర పోషించినట్లు పోలీసులు గుర్తించారు. కొందరిని బెదిరించి వారి నుంచి వసూలు చేసిన నగదుతో జాయ్ జమీమా, వేణుభాస్కర్‌రెడ్డిల మధ్య జరిగిన లావాదేవీలకు సంబంధించిన సాక్ష్యాలను పోలీసులు సేకరించారు. నగరంలో కృష్ణా కాలేజీ సమీపంలో నివాసముంటున్న ఒక వివాహితుడిని ఈ ఇద్దరూ కలిసి బంధించి మత్తుమందు ఇచ్చి బెదిరించి భారీ మొత్తంలో నగదు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. నగరంలో జరిగిన ఇలాంటి మరికొన్ని కేసుల్లో వేణుభాస్కరరెడ్డి పాత్రపై లోతైన దర్యాప్తు చేయవలసి ఉందని పోలీసులు పేర్కొన్నారు. కొంత కాలంగా తప్పించుకుని తిరుగుతున్న ఇతడి కోసం గాలిస్తున్న నేపథ్యంలో శనివారం ఎయిర్‌పోర్ట్ పోలీసులకు చిక్కాడు. తదుపరి దర్యాప్తు నిమిత్తం వేణుభాస్కర్‌రెడ్డిని కోర్టులో హాజరుపరుస్తామని ఎయిర్‌పోర్ట్ సీఐ చక్రధరరావు తెలిపారు.

నేటి నుంచి పీజీ వైద్యుల పునశ్చరణ సదస్సు



సదస్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

విశాఖపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ మానసిక వైద్యుల సంఘం, గాయత్రీ విద్యా పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం పీజీ వైద్యుల (మానసిక విభాగ) పునశ్చరణ సదస్సును నిర్వహిస్తున్నట్టు సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఎన్ఎన్ రాజు తెలిపారు. శనివారం ఉదయం జెడ్పీ వద్దనున్న అంకోసా హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఎంపీ శ్రీభరత్ హాజరవుతారన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి 250 మంది పీజీ వైద్యులతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ మానసిక వైద్య నిపుణులు 30 మంది హాజరై వివిధ అంశాలపై ప్రసంగిస్తారన్నారు. కోల్‌కతా నుంచి భాస్కర ముఖర్జీ, మణిపాల్ నుంచి డాక్టర్ పీఎస్‌వీఎన్ శర్మ, తదితరులు విచ్చేసి మానసిక సమస్యలకు సంబంధించి నూతన వైద్య విధానాలు, కొత్తగా వస్తున్న సమస్యలపై విద్యార్థులకు తెలియజేస్తారన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు జీవీఎస్ మూర్తి అధ్యక్షతన జరిగే సదస్సులో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, గాయత్రీ విద్యాపరిషత్ వైద్య కాలేజీ డీన్, విశ్రాంత డీఎంఈ డాక్టర్ సుబ్బారావు తదితరులు అతిథులుగా పాల్గొంటారన్నారు.

93 శాతం పింఛన్లు పంపిణీ

విశాఖపట్నం, నవంబరు (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సామాజిక పింఛన్లు ఈసారి ఒకరోజు ముందుగానే పంపిణీ చేశారు. శనివారం సాయంత్రం వరకూ 1,61,584 మందికిగాను 1,51,193 (93 శాతం) మందికి రూ. 65,10,25,500 పంపిణీ చేశారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో శనివారం పింఛన్ పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో తుఫాన్ ప్రభావంతో శనివారం ఉదయం నుంచి ముసురు వాతావరణం ఉన్నా సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. కొన్నిచోట్ల ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి పింఛన్లు అందజేశారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. మూడు నెలల వరకూ పింఛన్లు తీసుకునే వెసులుబాటు ఉండడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు కొందరు పింఛన్లు తీసుకోలేదు. వచ్చే రెండు, మూడు రోజుల్లో కూడా పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

ముసురు

విశాఖపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో జిల్లాలో శనివారం ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకూ దఫదఫాలుగా ఒక మోస్తరు వర్షం కురుస్తూనే ఉంది. వర్షంతో పాటు చలిగాలులు వీయడంతో పనులపై బయటకు వచ్చినవారు ఇబ్బందిపడ్డారు. కాగా శనివారం రాత్రి జిల్లాలో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారం జిల్లాలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కాగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు మధురవాడ వాంబే కాలనీలో 20 మిల్లీమీటర్లు, మారికవలసలో 19.5 మి.మీ., భీమిలిలో 15 మి.మీ. వర్షపాతం నమోదైంది.

చెన్నైకు గంజాయి తరలిస్తున్న ఐదుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మణమూర్తి

మహారాణిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా జి.మాడుగుల నుంచి చెన్నైకి గంజాయి తరలిస్తున్న అయిదుగురిని టూటౌన్ పోలీసులు పట్టుకున్నట్లు ఈస్టు ఏసీపీ లక్ష్మణమూర్తి తెలిపారు. శనివారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయి తీసుకెళ్లేందుకు చెన్నై నుంచి రాజేష్, నజీర్, జటునిషాలతో వచ్చిన షకీలా గుణ (51) అల్లూరి జిల్లాకు వచ్చారు. జి.మాడుగులలోని లాసంగి మల్లన్న అనే వ్యక్తిని వారు కలిశారు. అతని వద్ద 20 కేజీల గంజాయిని రెండు సంచులలో తీసుకొని విశాఖ వచ్చారు. టాస్కుఫోర్సు సిబ్బందికి అందిన పక్కా సమాచారంతో టూటౌన్ పోలీసులు దాడులు జరిపి వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మల్లన్న సహా అయిదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైల్లో రవాణా చేస్తున్న గంజాయి సంచులను స్వాధీనపరుచుకుని ముగ్గురిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. కేరళకు గంజాయి తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో జీఆర్పీ ఎస్‌ఐలు శాంతారాం, అబ్దుల్ మహారూఫ్, కేటీఆర్ లక్ష్మి మూడు బృందాలుగా ఏర్పడి తమ సిబ్బందితో సోదాలు నిర్వహించినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ధనుంజయనాయుడు తెలిపారు. ఈ సోదాల్లో కేరళకు చెందిన మహ్మద్ నాదిర్ష (27), బీహార్‌కు చెందిన నితీష్‌కువర్ (29), వికాస్‌కుమార్ (23)లను అదుపులోకి తీసుకుని వారి నుంచి సుమారు 30 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.